ఈనాడు
అమరావతి
కృష్ణా
మంగళవారం అక్టోబరు 15, 2024



పవన్ ఉండగా.. పల్లెకు పండగే..

కృష్ణా జిల్లాపై ఉపముఖ్యమంత్రి వరాల జల్లు



ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఆయన కుమారుడు వెంకట్రామ్

ఈనాడు, అమరావతి, కంకిపాడు, న్యూస్‌టుడే

కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న అనేక సుదీర్ఘ సమస్యలను 'పల్లెపండగ'లో భాగంగా పరిష్కరించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. కంకిపాడులో సోమవారం జరిగిన 'పల్లెపండగ' కార్యక్రమం ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాపై వరాల జల్లు కురిపించారు. కంకిపాడు సీహెచ్‌సీ ప్రహరీ, 11 అంతర్గత సీసీ రహదారులు, రెండు మినీ గోకులాలు, పునాదిపాడు గ్రామ పరిధిలో రెండు అంతర్గత రహదారుల నిర్మాణానికి పవన్ శంకుస్థాపన చేశారు. కంకిపాడు నుంచి గొడవర్రు మీదుగా రొయ్యూరు రహదారి పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలంటూ జిల్లా కలెక్టర్‌ను పవన్ ఆదేశించారు. ఎదురుమొండి, నాగాయలంక, గొల్లమంద, బ్రహ్మయ్యతోట తదితర లంక గ్రామాలకు అనుసంధాన రహదారులు లేక అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీరుస్తామని తెలిపారు. ఈ గ్రామాల్లోని 8వేల మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా రహదారుల అభివృద్ధికి ఆదేశాలు జారీ చేశారు. ★ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి మేరకు మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను పట్టాలెక్కించేందుకు కేంద్రంతో మాట్లాడి, త్వరలోనే కార్యాచరణ మొదలెట్టేలా చర్యలు తీసుకుంటామని పవన్ హామీ ఇచ్చారు. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 43 గ్రామాల్లో ప్రజలు తాగుతున్న జలాలు పసుపు పచ్చగా ఉన్నాయంటూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పవన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ మంచి నీటి బాటిళ్లను పవన్ సభలో చూపిస్తూ.. ఈ సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ★ కంకిపాడు, పునాదిపాడు, ఈడుపుగల్లు, గోసాల, ఉప్పలూరు తదితర కూడళ్లలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు ఆకట్టుకున్నాయి. ★ ఉదయం వర్షం రావడంతో 'పల్లె పండగ' నిర్వాహకుల్లో ఇబ్బందులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తమైంది. అయితే సభా కార్యక్రమాలు ముగిసే వరకు వర్షం పడలేదు. ★ పవన్ ప్రసంగిస్తున్న సమయంలో సభ మొత్తం కరతాళ ధ్వనులతో మారుమోగింది. యువత, మహిళలు భారీగా తరలివచ్చారు. డిజిటల్ తెరపై పవన్ కనిపించిన ప్రతిసారి అభిమానులు పూల వర్షం కురిపించారు. ★ ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, కలెక్టర్ డి.కె.బాలాజీ తదితరులు పవన్‌కు జ్ఞాపిక అందజేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆంజనేయస్వామి కాంస్య విగ్రహాన్ని పవన్‌కు అందజేసి సత్కరించారు.



నీరు రంగు మారి వస్తోందని పవన్‌కు చూపిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

మహాత్ముడి స్ఫూర్తితోనే.. - ఎంపీ వల్లభనేని బాలశౌరి



గ్రామాలు సామాజికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందినపుడే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయన్న మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లెపండగ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా ఒక్క రోజులోనే 13,326 పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. గత ప్రభుత్వంలో దాదాపు 3వేల మంది కౌలు రైతులు ఆత్మహత్యలు పాల్పడితే ఆ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున తన సొంత డబ్బులను పవన్ ఇచ్చారు. ఇటీవల కురిసిన వరదల కారణంగా 400 గ్రామాల్లో నష్టం జరిగితే ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున రూ.4 కోట్లు సొంత డబ్బులు అందించారు. గత ప్రభుత్వంలో కేంద్రం ఇచ్చిన జలజీవన్ మిషన్ నిధులు సక్రమంగా వినియోగించుకోలేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. ఆ నిధులు సద్వినియోగం చేసుకొని మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుస్తాం. కృష్ణా జిల్లావాసుల చిరకాల కోరిక.. మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను ప్రాజెక్టును త్వరలోనే సాకారం చేస్తాం.

వైకాపా పాలనలో సర్పంచులు రోడ్డుపాలు - కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ మంత్రి



గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రహదారులు వేయించిన సర్పంచులు, గుత్తేదారులు సకాలంలో బిల్లులు రాకపోవడంతో రోడ్డు పాలయ్యారు. వారి ఆస్తులను అమ్ముకునే పరిస్థితికి వచ్చారు. పంచాయతీ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసుకున్నారు తప్ప గ్రామాల్లో అభివృద్ధి పనులకు నోచుకోలేదు. కేంద్రం గ్రామాలకు విడుదల చేసిన రూ.12వేల కోట్లు సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రూ.4,500 కోట్లతో 30వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. 3వేల కి.మీ సీసీ రోడ్లు, 500 కి.మీ తారు రోడ్లు, 10వేల వాననీటి కందకాలు నిర్మిస్తున్నాం.


మాచవరం వద్ద కుంగిన రైల్వే ట్రాక్

పొన్నూరు, బాపట్ల, గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: చెన్నై నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రైల్వే ట్రాక్ ఒక వైపు కుంగింది. రెండు రోజులు నుంచి వర్షాలు కురవడంతో అక్కడ ప్రమాదకరంగా ఉంది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే రైళ్లను అతి తక్కువ వేగంతో కొనసాగిస్తున్నారు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికపై మరమ్మతుల ప్రక్రియను చేపట్టగా.. ఈ పనులకు వర్షం అడ్డంకిగా మారింది. మాచవరంలో సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో సోమవారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అక్కడ నిలిచిపోయింది. రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వందే భారత్ రైలును అప్పికట్లకు వెనుకకు పంపించారు. అప్పికట్ల నుంచి నిడుబ్రోలు వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాక్‌పై వందేభారత్ రైలును పంపారు. అదే ట్రాక్‌లో మిగిలిన రైళ్లను పంపిస్తున్నారు. ఆ మార్గంలో రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు.

జై భవానీ..

దీక్షాధారులతో ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లు రద్దీ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే





ఘాట్‌రోడ్డు వద్ద అమ్మవారికి నమస్కరిస్తూ..

దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగిసినా ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మ దర్శనానికి భవానీ దీక్షాధారుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మరో రెండు రోజులు భవానీ దీక్షాధారులు అమ్మవారి దర్శనానికి వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఇరుముడి సమర్పించిన భక్తులకు అవసరమైన ప్రసాదాలను కౌంటర్లలో సిద్ధం చేశారు. వినాయకుడి గుడి నుంచి క్యూలైన్‌లో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని కనకదుర్గానగర్‌కు చేరుతున్నారు. కనకదుర్గానగర్‌లో అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు ప్రసాదాల కౌంటర్ల వద్ద బారులు తీరుతున్నారు.



తరలివస్తున్న భవానీలు

కౌంటర్లు పెంచాలి

మూలానక్షత్రం నాటి నుంచి ఉత్సవాలు ముగిసేవరకు భక్తుల రద్దీ కొనసాగుతుండడంతో ప్రసాదాల కౌంటర్లు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం 11 లడ్డూ విక్రయ కేంద్రాలు మాత్రమే కనకదుర్గానగర్‌లో ఉన్నాయి. ఇవికాకుండా పలు ప్రాంతాల్లో కేంద్రాల ద్వారా నామమాత్రంగా విక్రయించారు.

దసరా ఉత్సవాల్లో రికార్డు స్థాయిలో లడ్డూ విక్రయాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాల్లో రికార్డు స్థాయిలో సుమారు 25 లక్షల లడ్డూ ప్రసాదాల విక్రయాలు జరిగాయి. మరో రెండు లక్షలు విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయి. వేడుకలు ముగిసిన తర్వాత కూడా భవానీ దీక్షాధారుల రద్దీ కొనసాగుతుండటంతో ప్రసాదాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఉత్సవాల్లో దాదాపు 15 లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది 15 రోజుల్లో 20 లక్షల లడ్డూ ప్రసాదాలు విక్రయించగా ఈ సారి ఆ సంఖ్య 27 లక్షలకు చేరింది.



కనకదుర్గా నగర్‌లో భక్తుల తాకిడి



అమ్మవారికి నివేదన సమయంలో క్యూలైన్లలో నిరీక్షణ

సిండికేట్లదే హవా!

సజావుగా మద్యం దుకాణాల లాటరీ



లాటరీ గదిలో దరఖాస్తుదారులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ సజావుగా సాగింది. మద్యం దుకాణాలు ఎవరికి దక్కుతాయో.. ఎవరు దరఖాస్తు రుసుం నష్టపోవాల్సి వస్తుందోననే చర్చ కొన్ని రోజులుగా ఉంది. దుకాణం దక్కకపోతుందా.. దేవుడు కరుణించకపోతాడా అని అదృష్టం పరీక్షించుకునేందుకు కొందరు ప్రయత్నించగా మరి కొందరు గతంలో మాదిరిగానే సిండికేట్‌గా మారి దరఖాస్తు చేసుకున్నారు. అయితే అక్కడక్కడా కొందరిని అదృష్టం వరించినా ఎప్పటి మాదిరిగా ఎక్కువ దుకాణాలు సిండికేట్ల పరం అయ్యాయి. అధికారులు మాత్రం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో లాటరీ ప్రక్రియ పూర్తి చేశారు.

సమయానికే ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా ఉన్న 8 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో మొత్తం 123 దుకాణాలకు గాను 2,942 దరఖాస్తులు వచ్చాయి. ఆయా దుకాణాల కేటాయింపునకు ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభించి 11 గంటలకల్లా పూర్తి చేయాలని భావించారు. హిందూ కళాశాలలో లాటరీ 8 సర్కిళ్ల వారీగా 8 కౌంటర్లు ఏర్పాటు చేశారు. తొలుత మచిలీపట్నం కౌంటర్‌ను ఉదయం 8 గంటలకే జేసీ గీతాంజలిశర్మ, పలువురు ఎక్సైజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. బందరు సర్కిల్ పరిధిలోని 16 దుకాణాలకు అదే కేంద్రం వద్ద లాటరీ పూర్తి చేశారు. అనంతరం వివిధ కౌంటర్‌లకు వెళ్లి లాటరీ తీస్తే సమయం పడుతుందని భావించి తరువాత వేరే బ్లాక్‌లో ఒకే చోట మిగిలిన 7 సర్కిళ్ల పరిధిలోని దుకాణాలకు లాటరీ నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటల కల్లా మొత్తం జిల్లాలోని 123 దుకాణాల లాటరీ ప్రక్రియ పూర్తి చేశారు. ఎక్సైజ్ అధికారులతోపాటు పరిశీలకులుగా కలెక్టర్ నియమించిన ప్రత్యేక అధికారులు ప్రక్రియను పర్యవేక్షించారు. సర్కిళ్ల వారీగా దరఖాస్తుదారులకు నంబర్లు కేటాయించి ఎక్కడ ఎంత మంది దరఖాస్తుదారులుంటే అన్ని టోకెన్లు వేసి జేసీ గీతాంజలి శర్మ లాటరీ తీశారు. సకాలంలో నిర్దేశించిన రుసుం చెల్లించకుంటే వేరేవారికి ఆ దుకాణం కేటాయించేలా ఒక్కో దుకాణానికి ఇద్దరు చొప్పున రిజర్వ్‌డ్‌గా లాటరీ తీశారు.



మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహిస్తున్న జేసీ గీతాంజలి శర్మ



ఆ నంబరు నాదే!

దరఖాస్తులకే రూ.కోటి పైగా

★ మచిలీపట్నంతోపాటు పెడన, గుడివాడ, తాడిగడప, ఉయ్యూరు, గన్నవరం పట్టణాల్లో ఎక్కువగా సిండికేట్‌లే హవా చాటారు. ఎక్కువ దుకాణాలను వారు కైవసం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కొందరు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధుల ఆదేశాలకు అనుగుణంగా సిండికేట్‌లుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే, ఇప్పటికే లిక్కర్ వ్యాపారంలో గుర్తింపు పొందినవారు కూడా సిండికేట్‌లుగా ఏర్పడ్డారు. 10 నుంచి 20 మంది వరకు కూడా బృందాలుగా ఏర్పడినట్లు లాటరీకి హాజరైన వారే చర్చించుకున్నారు.

★ మచిలీపట్నంకు చెందిన లిక్కర్ వ్యాపారులు బందరుతోపాటు పెడనలో కూడా దుకాణాలు దక్కించుకున్నారని పలువురు దరఖాస్తుదారులు చెప్పుకొన్నారు. పెడన నియోజకవర్గానికి చెందిన ఓ రాజకీయ నేత కుటుంబ సభ్యులు సైతం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో దుకాణాలకు దరఖాస్తు చేశారు. లాటరీకి హాజరు కావడంతోపాటు పలు దుకాణాలు కూడా దక్కించుకున్నారు.

★ మద్యం దుకాణాల కోసం అధికారపక్షం, ప్రతిపక్షం అనే తేడాలేకుండా సిండికేట్ కావడంపై విమర్శలు వచ్చాయి. దుకాణాలు దక్కించుకునేందుకు కేవలం దరఖాస్తులకే రూ.కోటికిపైగా వెచ్చించిన సిండికేట్‌లు ఉండటం గమనార్హం. తలాకొంత వేసుకుని దరఖాస్తు చేసుకున్న పలువురు దుకాణాలు దక్కకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.



కర్ణాటక నుంచి వచ్చిన మహేష్ ఎ బాతే తదితరులు



యూపీకి చెందిన అనూజ్, లోకేష్ చంద్

మహిళలు సైతం హాజరు.. అన్ని సర్కిళ్ల పరిధిలోనూ మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. కొందరు తమ కుటుంబ సభ్యుల్లోని మహిళలతో దరఖాస్తు చేయించారు. గుడ్లవల్లేరుకు చెందిన ఈడే సుధారాణి, బాపులపాడుకు చెందిన కె.హారిక, తాడిగడపకు చెందిన కె.అమూల్య, పెనమలూరు నుంచి డి.వెంకటనాగలక్ష్మి, కృత్తివెన్నుకు చెందిన ఉప్పాల రాజకుమారి దుకాణాలు దక్కించుకున్నారు.

అక్కడే బేరం.. మద్యం దుకాణాలకు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు స్వీకరించడంతో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. పలువురు దుకాణాలు కూడా దక్కించుకున్నారు. కొందరు స్థానికేతరులు దక్కించుకున్న దుకాణాలను వేరే వారికి కేటాయించేందుకు అక్కడే బేరం పెట్టారు. కొందరు లిక్కర్ వ్యాపారులు వారితో బేరసారాలు ఆడారు.

కోలాహలంగా కళాశాల ప్రాంగణం.. దరఖాస్తుదారులతోపాటు వారి వెంట వచ్చిన వారితో హిందూ కళాశాల ప్రాంగణం కోలాహలంగా కనిపించింది. సర్కిళ్ల పరిధిలోని దుకాణాల వారీగా లాటరీ నిర్వహించగా మిగిలినవారు వారి వంతు వచ్చే వరకు నిరీక్షించారు. వారి కోసం ప్రత్యేకంగా షామియానాలు, కుర్చీలతోపాటు ఫ్యానులు ఏర్పాటు చేశారు. ఎస్పీ గంగాధరరావు బందోబస్తును పరిశీలించారు.



లాటరీ తీస్తుంటే ఉత్కంఠగా చూస్తూ..



లాటరీ రావడంతో ఆనందంగా..

ఒకరికి రెండేసి.. మూడేసి దుకాణాలు

ఒక మద్యం దుకాణం కోసం పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసినా దుకాణం దక్కనివారు అనేక మంది ఉంటే కొందరు ఒక్కొక్కరు రెండు, మూడు దుకాణాలు దక్కించుకోవడం విశేషం. గుడివాడకు చెందిన కొప్పాక రామకృష్ణ ఆ పురపాలక సంఘ పరిధిలోని 48, 49, 51 దుకాణాలు దక్కించుకున్నారు. గన్నవరానికి చెందిన పసుపులేటి లక్ష్మీనారాయణ 74, 78 దుకాణాలు పొందారు. బాపులపాడుకు చెందిన పరుచూరి నరేష్ బాపులపాడు మండలం పరిధిలోని 80, 86, 88 నంబర్ల దుకాణాలతోపాటు ఉంగుటూరు మండలంలోని 92వ దుకాణంతో నాలుగు దుకాణాలు కైవసం చేసుకున్నారు. ఎం.సుబ్బారావు అనే వ్యక్తి తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని 116, 117 దుకాణాలను దక్కించుకున్నారు. ఈ రెండు దుకాణాలకు జిల్లాలోనే అత్యధిక దరఖాస్తులు రావడం గమనార్హం. 116 దుకాణానికి 52 దరఖాస్తులు, 117 దుకాణానికి 52 మంది చొప్పున పోటీపడ్డారు. పెనమలూరుకు చెందిన అనుగు సుధాకరరెడ్డి కూడా 120, 121 రెండు దుకాణాలను దక్కించుకున్నారు.

ఒకటి దిల్లీ వ్యక్తికి.. మరొకటి బెంగళూరు వాసికి..

మచిలీపట్నం పరిధిలోని మొదటి రెండు దుకాణాలను ఇతర రాష్ట్రాల దక్కించుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మహేష్ బాతే ఒకటో నంబరు దుకాణాన్ని లాటరీలో దక్కించుకోగా రెండో నంబరు దుకాణాన్ని దిల్లీకి చెందిన లోకేష్‌చంద్ దక్కించుకున్నారు. దరఖాస్తుదారుల తరపున వ్యక్తులు లాటరీ ప్రక్రియకు హాజరయ్యారు. వారు దుకాణాలు నిర్వహించరని, విక్రయిస్తారనే వ్యాఖ్యలు వినిపించాయి.

వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : వృద్ధుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి వృద్ధుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనన్నారు. వృద్ధుల సమస్యలపై ఇప్పటి వరకు 270 ఫిర్యాదులు రాగా వాటిలో 257 పరిష్కరించామన్నారు. మండల స్థాయిలో తహసీల్దారు, సీఐ, వైద్యాధికారితోపాటు చురుగ్గా ఉండే వృద్ధులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ కమిటీ సభ్యులు ప్రతి నెలా మొదటి మంగళవారం సమావేశమై వృద్ధుల సమస్యలను చర్చించి పరిష్కరిస్తారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మూడో శుక్రవారం వృద్ధుల సంక్షేమం కోసం జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ. పాల్గొన్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య, అధికారులు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీలు, ఇతర వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. దివ్యాంగుల సంక్షేమ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో దివ్యాంగుల వైద్య విభాగాన్ని దిగువన ఏర్పాటు చేయాలని ఆర్ఎంవో నిరంజన్‌కు సూచించారు. కలెక్టరేట్‌లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ఇబ్బంది పడుతున్నామని కొందరు చెప్పగా వెంటనే సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు సంబంధించి పలు అంశాలపై సమీక్షించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య, అదనపు ఎస్పీ ఎస్వీడీ ప్రసాద్, జిల్లా వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు కామరాజు, డీసీహెచ్ఎస్ శ్రావణ్‌కుమార్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, ఎల్డీఎం జయవర్ధన్, ఆర్డీవోలు స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, షారోన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజన్ తయారీకి చర్యలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్ తయారీపై నిర్వహించిన వీసీకి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హాజరయ్యారు. జిల్లా విజన్ ప్రణాళిక పురోగతిని సీఎస్‌కు వివరించారు. జిల్లా విజన్ ప్రణాళిక తయారీ కోసం ఆయాశాఖల నుంచి నివేదిక సేకరించామన్నారు. జిల్లా విజన్ ప్రణాళిక ఈ నెల 18 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

స్పందించారు.. వ్యర్థాలు కరిగించారు..

స్పందనకు వందనం



విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిని ఆనుకొని నెలల తరబడి కొండలా పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించకపోవడంపై ఆగస్టు 26న ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. మొత్తం చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి తరలించేయడంతో ప్రస్తుతం అక్కడ పరిశుభ్ర వాతావరణం నెలకొంది.

–ఈనాడు, కృష్ణా



బాల్యం మసక.. మసక

పాఠశాలల్లో నేత్ర పరీక్షలు పునఃప్రారంభించాలంటున్న తల్లిదండ్రులు

న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం


విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

చరవాణులు, బుల్లితెరలకు అతుక్కుపోతూ చిన్నారులు కంటి సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఫలితంగా భావి పౌరుల కంటి చూపు మసకబారుతోంది. తక్షణం ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో నిలిచిన నేత్ర వైద్య సేవలు పునఃప్రారంభించి బాలల్లో నేత్ర సమస్యల్ని ఆదిలోనే గుర్తించి వారి బంగారు భవితకు దారి చూపాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

జిల్లాలోని ఆయా మండలాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని యాజమాన్యాల పరిధిలో పూర్వ ప్రాథమిక నుంచి 12వ తరగతి వరకు 2,86,703 మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎంపీపీ, జడ్పీ, పురపాలక, ప్రైవేటు ఎయిడెడ్, ప్రైవేటు ఎయిడెడ్ ఓరియంటల్, ఏపీ ఆర్ఈఐ సొసైటీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ, ఏపీటీడబ్ల్యూఆర్ఈఐ సొసైటీ స్కూల్స్, బీసీ సంక్షేమ పాఠశాలలు మొత్తం 1,360 ఉండగా వాటిలో 98,637 మంది, 432 ప్రైవేటు పాఠశాలల్లో 1,88,066 మంది చదువుకుంటున్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో 178 పాఠశాలలకు చెందిన 13,778 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 1,637 మంది చిన్నారులకు కళ్లజోళ్లు అవసరంగా గుర్తించి వాటిని అందించారు. గత వైకాపా ప్రభుత్వంలో కొద్ది మందికి మాత్రమే పరీక్షించి ఆపేశారని.. ఈ ఏడాది పునఃప్రారంభించి పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


పెరుగుతున్న దృష్టి సమస్యలు

ప్రస్తుత తరుణంలో చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలు కంటి సమస్యతో బాధ పడుతున్నారు. ప్రధానంగా చిన్నారుల్లో ఈ సమస్య ఆలోచింపజేస్తోంది. ఎక్కువ సమయం చరవాణులు, టీవీలకు అతుక్కుపోవడం, కంప్యూటర్, ల్యాప్‌టాప్ వంటివి వినియోగించడం వల్ల అత్యధిక మంది ఈ రుగ్మత బారిన పడుతున్నారు. కొందరు సమపాళ్లలో ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడి తదితర కారణాలతో ఇరవై ఏళ్లు నిండకుండానే అరవై ఏళ్ల వృద్ధుల్లా కళ్లజోళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే బడి ఈడు బాలబాలికలు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీంతోపాటు తల్లిదండ్రులు కూడా మరింత అప్రమత్తం కావాల్సి ఉంది.

మిద్దె తోట.. ఆరోగ్య బాట



కరెన్సీనగర్, న్యూస్‌టుడే


మిద్దెపై పందిరి, కింద కుండీల్లో కాయగూరలు

ప్రస్తుతం మిద్దె తోటకు ప్రాధాన్యం పెరుగుతోంది. స్థలం కొరత నేపథ్యంలో మిద్దెలపై సేంద్రియ విధానంలో పంటల సాగుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. ఆ కోవకు చెందినవారే విజయవాడ భారతీనగర్‌కు చెందిన ధవళేశ్వరపు నాగలక్ష్మి. ఆమె సొంతూరు ఆకివీడు. భర్త భాస్కరరావు బ్యాంకు మేనేజరు కావడంతో విజయవాడ వచ్చారు. 1987లో కాలనీలో స్థలం కొని ఇల్లు కట్టించుకున్నారు. కొంత భాగం పెరటిగా వాడారు. 2000లో ఆ స్థలంలో పనివాళ్ల కోసం షెడ్డు వేశారు. దాంతో పెరటి సాగు మిద్దెపైకి చేరింది. తాత నూకరాజు స్ఫూర్తితో సాగుపై దృష్టి పెట్టారు. అబ్బాయి, అమ్మాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో మొక్కల పెంపకానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.

డాబాపై అడుగు ఎత్తున ఇనుప చట్రాలు బిగించారు. వాటిపై కుండీలు పెట్టారు. ఇనుప పైపులు పెట్టి వాటికి పందిరిలా తీగలు చుట్టారు. కుండీల్లో మట్టి, ఎండిన ఆకులు, కూరగాయల వ్యర్థాలు పొరలు వేశారు. పది రోజుల తర్వాత వాటిలో మొక్కలు పెట్టి జీవామృతం, పంచగవ్యం, పిడకలు వేసి సరిపడా నీళ్లు పోస్తున్నారు. క్రిమికీటకాలు వాలకుండా, తెగుళ్లు రాకుండా మాగిన పండ్లు, బెల్లం తదితరాలతో తయారు చేసిన ద్రావణం, వేప నూనె, దశపత్ర కషాయాన్ని మొక్కలపై పిచికారీ చేస్తున్నారు. ట్రాప్ విధానంతో పురుగుల ఆకర్షించి చంపుతున్నారు.

పండించేవి ఇవే..

కాకర, సొర, పొట్ల, బీర, చిక్కుడు, దోస, తీగ బచ్చలి, వంగ, టమాటా, పచ్చిమిర్చి పండిస్తున్నారు. చామంతి, ఆస్టర్, మల్లి, సంపెంగ, ఆడీనియం, మందార, బంతి, గులాబీ, లిల్లీ పూల మొక్కలు వేశారు. కొండపిండాకు, తమలపాకులు, నేల వేము, బిళ్లగన్నేరు, గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, పుదీనా, పొన్నగంటి కూర, బచ్చలి, కొత్తిమీర, కరివేపాకు సాగు చేస్తున్నారు. మామిడి, బత్తాయి, జామ, దానిమ్మ, ద్రాక్ష పండిస్తున్నారు. సేంద్రియ సాగుతో పండించిన కూరగాయలు, ఆకుకూరలతో ఆరోగ్యానికి మేలని ఆమె వివరిస్తున్నారు.

గ్రీన్‌హౌస్ సాగు చేస్తా



టీవీకి, ముచ్చట్లకు బానిస కాకుండా మొక్కలతో జీవనం ఆనందంగా ఉంటుంది. 'వన్ ఎర్త్.. వన్ లైఫ్' సంస్థ సహకారం తీసుకుంటున్నా. ఇటీవల 'ఇన్నైవేట్ యువర్ కమిషనర్' కార్యక్రమానికి ఎంపికయ్యా. కమిషనర్ ఇచ్చిన రూ.పది వేలను ఆ సంస్థకే ఇచ్చేశాను. మిద్దె సాగుతో 1-2 డిగ్రీల ఉష్ణోగ్రత ఇంటిలో తగ్గుతుంది. సొంతంగా అంటుకట్టడం నేర్చుకొని ఒకే మొక్క నుంచి టమాటా, వంగ పండించా. గ్రీన్ హౌస్ సాగు చేయాలని ఉంది. 2011లో 'ఈనాడు-వసుంధర' నిర్వహించిన 'మాతృమూర్తుల... దీవెన' కార్యక్రమంలో ట్రోఫీతో పాటు రూ.15 వేల నగదు పురస్కారం అందుకున్నా. ఈ ఏడాది జనవరిలో విజయవాడ రోజ్ సొసైటీ నిర్వహించిన పోటీల్లో అవార్డు కైవసం చేసుకున్నా.

- నాగలక్ష్మి ధవళేశ్వరపు



ప్రశ్న: టమాట పంటలో నీటి యాజమాన్యం, పచ్చదోమ నివారణ చర్యలు తెలపండి? - కె.శ్రీనివాసరావు, మల్లంపల్లి

సమాధానం: టమాట పంటను సంవత్సరం పొడవునా అన్ని రుతువుల్లో పండిస్తారు. అధిక దిగుబడికి శీతాకాలం అనువైనది. భూమిలో తేమను బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. వేసవిలో ప్రతి 5-6 రోజులకు ఒకసారి తడి అవసరం ఉంటుంది. పచ్చదోమ ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడం వలన ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపీ ఎండి ఎర్రబడి చివరగా ముడుచుకుని దొనెలాగా కనిపిస్తాయి. నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

- ఘంటసాల, న్యూస్‌టుడే

ఈతల మధ్య అంతరాన్ని తగ్గిస్తే పాడి లాభదాయకం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఏడాదికో దూడ లక్ష్యంతో పశుపోషణ లాభదాయకంగా ఉంటుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఆ లక్ష్య సాధనకు అనుసరించాల్సిన పద్ధతులను ఇబ్రహీంపట్నం పశు వైద్యశాల వైద్యాధికారి మోహన్‌కృష్ణ వివరించారు.

★ పశుపోషణలో మంచి జాతులను ఎన్నుకోవడం, ఈతల మధ్య అంతరం తగ్గించుకోవడం, శాస్త్రీయ పద్ధతిలో సమీకృత దాణా, మేలైన పశుగ్రాసాలను వాడితే లక్ష్యాన్ని సాధించవచ్చు.

★ పశువు చూడితో ఉన్నప్పుడు ఏడో నెల నుంచి రోజూ రెండు కిలోల సమీకృత దాణా, 50 గ్రాముల మిక్చర్, 20 నుంచి 30 కిలోల సూపర్ నేపియర్ లాంటి మేలైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలి.



★ శుభ్రమైన వాతావరణంలో పెంచితే పశువు ఈనిన తర్వాత 45 రోజుల నుంచి 90 రోజుల వ్యవధిలో మొదటి ఎదకు వస్తుంది. అప్పుడు పొర్లిస్తే చూలు కట్టే అవకాశం 60 నుంచి 70 శాతం వరకు ఉంటుంది.

★ పశువు చూలు కట్టిన తరువాత ఏడెనిమిది నెలల వరకు ఉదయం సాయంత్రం 8 నుంచి 10 లీటర్ల పాలు ఇస్తుంది. ఏడాదికొక దూడ ఉత్పత్తి అవుతూ పశువు జీవితం కాలంలో (సుమారు 15 సంవత్సరాలు) ఎక్కువ పాలు ఉత్పత్తి చేస్తుంది. ఒక ఈతకు సుమారు రెండు వేల లీటర్ల పాలు ఇచ్చే అవకాశం ఉంటుంది.

★ ఎక్కువ మంది పశు పోషకులు ఈతల మధ్య అంతరాన్ని ఒకటిన్నర సంవత్సరాల నుంచి రెండున్నర సంవత్సరాలుగా చూస్తున్నారు. ఫలితంగా పాడి నష్టదాయకంగా మారుతోంది. ఈతల మధ్య అంతరాన్ని ఆవుల్లో సంవత్సరానికి, గేదెల్లో 15 నెలలకు తగ్గించుకోవచ్చు. పై సూచనలు, యాజమాన్య పద్ధతులు పాటించి పశుపోషణ చేసుకున్నట్లయితే పాడి లాభదాయకంగా ఉంటుంది.

శ్రీకాకుళేశ్వరుని సేవలో సీనియర్ నటి అన్నపూర్ణ


ఆలయ ప్రాంగణంలో అన్నపూర్ణతో రుత్వికుల బృందం

శ్రీకాకుళం (ఘంటసాల), న్యూస్‌టుడే: ప్రముఖ సీనియర్ నటి అన్నపూర్ణ శ్రీకాకుళేశ్వరస్వామిని సోమవారం దర్శించారు. రుత్వికులు భాస్కరాచార్యులు బృందం ఆధ్వర్యంలో అన్నపూర్ణకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులర్పించారు. ఆలయ చరిత్రను రుత్వికుల బృందం అన్నపూర్ణకు వివరించారు. ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

దీనుల ఆవేదనలు

ఎస్పీకి బాధితుల ఫిర్యాదు


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ

మచిలీపట్నం కార్పొరేషన్: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. సోమవారం మచిలీపట్నంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నారంటూ తోట్లవల్లూరుకు చెందిన వివాహిత ఎస్పీకి తన సమస్యను వివరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తన పేరిట ఉన్న ఆస్తిని కొడుకులు వారి పేరిట రాయాలంటూ దాడికి పాల్పడుతున్నారని మొవ్వకు చెందిన వీరయ్య అనే వృద్ధుడు మొరపెట్టుకున్నారు. రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్న వ్యక్తి ఆ డబ్బులు అడుగుతుంటే అసభ్యంగా మాట్లాడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని, చర్యలు తీసుకుని తన డబ్బులు ఇప్పించాలని గుడివాడకు చెందిన రామారావు ఫిర్యాదు చేశారు. ఇలా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు తమ సమస్యలపై అర్జీలు దాఖలు చేశారు. విచారణ చేసి సమస్యలు పరిష్కరించి, న్యాయం చేస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఫిర్యాదులపై ఆయా ప్రాంతాల పోలీసు అధికారులతో మాట్లాడి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం


ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న దాత అవుతు శివారెడ్డి

నున్న(రామవరప్పాడు), న్యూస్‌టుడే: విజయవాడ రూరల్ మండలం నున్నలో సీసీ రోడ్డు నిర్మాణానికి అవుతు శివారెడ్డి తన తండ్రి గురవారెడ్డి జ్ఞాపకార్థం రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. సోమవారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు చెక్కు అందజేశారు. వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి దాతలు కూడా ముందుకు రావాలన్నారు. రోడ్డు నిర్మాణానికి విరాళం అందజేసిన శివారెడ్డిని అభినందించారు. ఈవో జీటీవీ రమణ, నాయకులు కలకొటి శ్రీనివాసరెడ్డి, గూడవల్లి నర్సయ్య, మాదు శివరాం ప్రసాద్, కొటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కూటమి సర్కారు కృషి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గ్రామాల్లో నూరు శాతం సిమెంటు రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. లంకమ్మమాన్యం గ్రామంలో సోమవారం ఆయన సిమెంటు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. . సోమవారం నుంచి ఈ నెల 21 వరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల సమగ్రాభివృద్ధికి పల్లె పండగకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలో మీటర్ల పొడవున 496 సిమెంటు రహదారులు నిర్మించనున్నట్లు చెప్పారు. అవనిగడ్డ మండలంలో రూ.549.60 లక్షలతో మంజూరైన 9,061 మీటర్లు పొడవున 104 సిమెంటు రహదార్లు, అదనంగా మంజూరైన రూ.76.20 లక్షలతో 1,270 మీటర్లు పొడవున 13 సిమెంటు రహదారులు మొత్తం రూ.625.80 లక్షలతో 10,331 మీటర్లు పొడవున 117 సీసీ. రోడ్లు నిర్మించనున్నట్లు వివరించారు. జనసేన నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, సర్పంచి జి.ఉమ, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు శేషుబాబు, పంచాయతీరాజ్ డీఈ సురేష్, ఉపాధి హామీ పథకం ఏపీవో రవికుమార్, ఈవోఆర్డీ అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి అనిత, తదితర నాయకులు పాల్గొన్నారు.

భారత రక్షణ రంగానికి గుర్తింపు తెచ్చిన సూరి భగవంతం



విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి, పక్కన బుద్ధప్రసాద్, డా.సతీశ్ రెడ్డి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: భారత రక్షణ రంగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన వ్యక్తి డా.సూరి భగవంతం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. డీఆర్‌డీవో పూర్వపు డైరెక్టర్ డా.సూరి భగవంతం 115వ జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని శ్రీశోభనాద్రి లక్ష్మీనరసింహ వేద పాఠశాల ఆవరణలో ఆయన కాంస్య విగ్రహాన్ని సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో పూర్వపు ఛైర్మన్ డా.జి.సతీశ్‌రెడ్డిలతో కలిసి మంత్రి పార్థసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. నూజివీడులో డా.సూరి భగవంతం స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ట కృషి చేసిన వారికి ఆయన పేరిట అవార్డులు ప్రదానం చేసేందుకు ట్రస్టు నెలకొల్పాలని సూచించారు. దానికి తాను రూ.5 లక్షలు విరాళంగా అందజేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దేశ రక్షణలో ప్రధాన పాత్ర వహించే బాలిస్టిక్ లాంచింగ్ పాడ్‌ను కృష్ణాజిల్లా నాగాయలంక సమీపంలో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని చెబుతూ, దాని కోసం కృషి చేసిన డా.సతీశ్‌రెడ్డిని ఆయన అభినందించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు నేలపై జన్మించిన మహనీయులకు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డా.జి.సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణకు ఇతర దేశాల నుంచి పరికరాలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి మనం చేరుకోవడంలో డా.సూరి భగవంతం ముఖ్య పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో డా.సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.బి.రామ్ తదితరులు పాల్గొన్నారు.

18 వరకు ఫీజు చెల్లించొచ్చు

పెడన(గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ 3, 5, 7 సెమిస్టర్ల విద్యార్థులు పరీక్ష ఫీజు ఈనెల 18వ తేదీ వరకు చెల్లించవచ్చని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి పి.వీరబ్రహ్మాచారి తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 21వ తేదీ వరకు, రూ.1,000 అపరాధ రుసుముతో 23వ తేదీ వరకు, రూ.3 వేల అపరాధ రుసుముతో 25వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. 3, 5 సెమిస్టర్ల విద్యార్థులకు నవంబర్ 18 నుంచి, ఏడో సెమిస్టర్ వారికి డిసెంబరు 4 నుంచి పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి ఏడాది ప్రథమ సెమిస్టర్ విద్యార్థులు నవంబరు 4 లోపు ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. వీరికి డిసెంబరు 9 నుంచి పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.

ప్రాణం తీసిన గుంత


మృతుడు నందమూరి లీలాకృష్ణ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డుపై గుంత ఓ వ్యక్తి ప్రాణాన్ని బలిగొన్న ఘటన గన్నవరం మండలం ముస్తాబాద వద్ద చోటుచేసుకుంది. విజయవాడ రూరల్ మండలం నిడమానూరుకు చెందిన నందమూరి లీలాకృష్ణ(32) తన స్నేహితుడిని కలిసేందుకు ఆదివారం మధ్యాహ్నం ముస్తాబాద వచ్చాడు. స్నేహితుడితో మాట్లాడిన అనంతరం తిరిగి రామవరప్పాడు కూడలి మీదుగా నిడమానూరు వెళ్లేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ముస్తాబాద శివారులోని గోదాముల సమీపంలోని ఓ గుంతలో లీలాకృష్ణ బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని స్థానికులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు భార్య ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


రేపల్లె రాజు (పాత చిత్రం)

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు మండల పరిధిలోని వి.కొత్తపాలెంకు చెందిన రేపల్లె రాజు ఆదివారం విజయవాడ కృష్ణలంకలోని స్వర్గపురి ఘాట్ వద్ద కృష్ణా నదిలో స్నానానికి దిగి గల్లంతైన విషయం విదితమే. రాజా కుటుంబ సభ్యులు రేపల్లె రాజియ్య, తండ్రి అజయ్‌కుమార్ తదితరులు గాలింపు చర్యలు చేపట్టగా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మృతదేహం లభించింది. కుమారుడిని సీఏ చదివించి ప్రయోజకుడిని చేయాలనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశ నదీ స్నానం రూపంలో మృత్యువు కబళించివేయడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన



కలెక్టర్ బాలాజీకి మొక్క అందజేస్తున్న సునీత

కలెక్టర్‌తో జిల్లా అటవీ శాఖాధికారి భేటీ

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లా అటవీ శాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.సునీత సోమవారం జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ బాలాజీకి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా శాఖ పరమైన ప్రణాళికల గురించి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాల్సిందే

పెడన(గ్రామీణం, న్యూస్‌టుడే: ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే చేపట్టాలని జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు పసుపు బ్యాడ్జీలు ధరించి సోమవారం విధులకు హాజరై నిరసన తెలిపారు. ప్రభుత్వ జీవో 114ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరవుతామని ప్రభుత్వ ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బీజే గాంధీ తెలిపారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కార్యక్రమాల్ని ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం అధికారులు వెంటనే చొరవ తీసుకుని నిలిచిపోయిన ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని పెడన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? నగరంలోని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారి పక్కన డ్రెయిన్‌లో పూడిక కారణంగా మురుగు పారడం లేదు. **- స్థానికులు**

✔ సిబ్బందిని పంపి వెంటనే పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

- మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మచిలీపట్నం నగరపాలకసంస్థ

? శ్రీనివాసనగర్ కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. రహదారుల నిర్మాణం చేపట్టాలి.

- స్థానికులు

✔ వివిధ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **- బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్**

- మచిలీపట్నంకార్పొరేషన్, న్యూస్‌టుడే

భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవం

మోపిదేవి, ఘంటసాల, కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఘంటసాల అంబేడ్కర్‌నగర్‌లో అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం సమీపంలోని కృష్ణానదిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. కోడూరులోని అంకాలమ్మ గుడిలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జడ్పీటీసీ సభ్యుడు యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పెరిగిన పొదలు.. శిథిలమవుతున్న భవనాలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పొదలతోపాటు ఆ పక్కనే భయపెడుతున్న శిథిల భవనాలతో ఉద్యోగులతోపాటు వివిధ సేవల నిమిత్తం వచ్చే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు ఉండే కార్యాలయాలైనా ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మచిలీపట్నంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పిచ్చిమొక్కలు పొదల్లా మారి భవనాలను సైతం కప్పేస్తున్నాయి. దీంతో ఆయా కార్యాలయాల్లోని ఉద్యోగులు భయపడుతూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి దాపురించింది.

❖ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. వారు నిరీక్షించేందుకు ఏర్పాటు చేసిన షెడ్డువద్ద పొదలు పెరిగాయి. ఇదే కార్యాలయంలో అనేక చోట్ల పిచ్చిచెట్లు పెరిగాయి. చెత్త వేస్తున్నారు. అయినా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు అక్కడ నిరీక్షిస్తూ అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పక్కనే ఉన్న శిథిల భవనం ప్రాంగణం అడవిలా తయారయింది. కనీసం లోపలకు వెళ్లే అవకాశం కూడా లేకుండా ముఖద్వారం నుంచే పొదలు దట్టంగా అలుముకున్నాయి. అప్పుడప్పుడు విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ భవనంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహించేవారు. ఖాళీ చేసిన నాటి నుంచి పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. శుభ్రంచేసి, మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని వివిధ భవనాల చుట్టూ పొదలు ఆక్రమించి ఉన్నాయి.



ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పక్కన అడవిలా తయారైన శిథిలభవన ప్రాంగణం



జిల్లా పరిషత్ కార్యాలయంలో పలు భవనాల చుట్టూ నెలకొన్న పరిస్థితి



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలు నిరీక్షించే ప్రాంతంలో ఇలా..

కూలడానికి సిద్ధంగా..

ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లోనే శిథిల భవనాలు ఏ క్షణాన కూలుతాయో అన్నట్లు ఉన్నాయి. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం పక్కనే ఉన్న శిథిల భవనం ఏళ్ల తరబడి అలాగే ఉండిపోయి ప్రస్తుతం కూలడానికి సిద్ధంగా ఉంది. ఆ భవనం పక్కన ఉద్యోగులతోపాటు స్థానికులు కూడా రాకపోకలు సాగిస్తున్నారు. భవనాన్ని కూల్చివేస్తామని చెప్పడమే కానీ ఇంతవరకు పట్టించుకున్న నాథులు లేరు. తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో కూడా ఓ శిథిల భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. పక్కనే ఖజానా శాఖ కార్యాలయం ఉంది. సబ్‌జైల్‌కు కూడా ఆ పక్కనుంచే రాకపోకలు సాగిస్తారు. భవనం కూలిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా స్పందించడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం పక్కన కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం

మచిలీపట్నంలో రూ.71 కోట్లతో అభివృద్ధి పనులు : మంత్రి కొల్లు

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: మచిలీపట్నం నియోజకవర్గంలో రూ.71 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. మరికొన్ని పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఆర్‌అండ్‌బీ కింద నియోజకవర్గంలో శిథిలమైన రోడ్ల పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని, వాటితో వివిధ గ్రామాల్లో రోడ్లు, శ్మశానాలు, ప్రహరీ నిర్మాణం చేపడతామన్నారు. గతంలో మంత్రిగా పని చేసిన పేర్ని నాని నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ముడా నిధులను ఇతర పనులకు పేర్ని నాని మళ్లించారని విమర్శించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తెదేపా సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచె నాని, కాగిత వెంకటేశ్వరరావు, లంకె శేషగిరి, పిప్పళ్ళ కాంతారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

రూ.76.90 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

మాట్లం, నిడమర్రు(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాలు మరింత వృద్ధి చెందుతాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కృత్తివెన్ను మండలంలోని మాట్లం, నిడమర్రు పంచాయతీల్లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన పల్లెపండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాట్లం పంచాయతీలో రూ.31.9 లక్షలు, నిడమర్రులో రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కాగిత మాట్లాడుతూ గత వైకాపా పాలనలో గ్రామాల్లోని రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయని, పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో రహదారులన్నీ సీసీ రోడ్లుగా మారబోతున్నాయని, నిజంగా ఇది పల్లె పండగేనని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. మాట్లంలోని శ్రీవిజయకనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా, జనసేన అధ్యక్షులు ఒడుగు తులసీరావు, పాశం నాగమల్లేశ్వరరావు, పెడన నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్, మాట్లం, నిడమర్రు సర్పంచులు తిరుమాని పాండురాంగారావు, బస్వాని మహాలక్ష్మి, నాయకులు యాదంరెడ్డి కొండ, రావూరి తాతాజీ, పీఆర్ ఏఈ నగేష్, డిప్యూటీ తహసీల్దార్ శశికుమార్, మాజీ సర్పంచి బస్వాని బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడనలో పోస్టులు.. బందరులో విధులు

కనిపించని ఆర్‌అండ్‌బీ, డ్రెయినేజీ కార్యాలయాలు

పెడన, న్యూస్‌టుడే: పెడనలో ఆర్‌అండ్‌బీ, డ్రెయినేజీ సెక్షన్ కార్యాలయాల ఆచూకీ కనిపించడంలేదు. ఈ రెండు కార్యాలయాలకు ఏఈ స్థాయి అధికారులు ఉన్నా.. ఆ ఇద్దరు మచిలీపట్నానికే పరిమితమవుతున్నారు. పెడన కేంద్రంగా ఆర్‌అండ్‌బీ సెక్షన్ దీర్ఘకాలం క్రితం ఏర్పాటు చేశారు. ఈ సెక్షన్‌కు ఏఈ స్థాయి అధికారి పోస్టు ఉండగా.. గత ప్రభుత్వంలో గుడివాడ ఏఈ కిశోర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. తాజా బదిలీల్లో పెడనకు రెగ్యులర్ ఏఈగా ఆయన్ను నియమించారు. పెడనలో ఈ కార్యాలయం లేకపోవడంతో ఆయన మచిలీపట్నంలోని డీఈ కార్యాలయానికి పరిమితమవుతున్నారు. బంటుమిల్లికి సదరు ఏఈ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ రెండు సెక్షన్ల పరిధిలో 84 కి.మీల పొడవున ఆర్‌అండ్‌బీ రహదారులు ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలు చెప్పాలన్నా.. అత్యవసర సమాచారం తెలియజేయాలన్నా అధికారులు అందుబాటులో ఉండడంలేదు. కనీసం ఫోన్ నంబర్లు కూడా లేకపోవడంతో అసలు ఆర్‌అండ్‌బీ పెడనలో ఉందా. . లేదా అన్న సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది.


డ్రెయినేజీ విభాగం కూడా ఇంతే: డ్రెయినేజి పెడన సెక్షన్ కార్యాలయం పరిస్థితి కూడా ఇదే రీతిలో మారింది. ఈ సెక్షన్ పరిధిలో లజ్జబండ, వడ్లమన్నాడు మేజర్ డ్రెయిన్లు, 63 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. తాజా బదిలీల్లో బంటుమిల్లి జలవనరుల శాఖ ఏఈ వెంపటి నాగేశ్వరరావును పెడన డ్రెయినేజీ సెక్షన్ ఏఈగా నియమించారు. ఈ అధికారి పెడనలో ఇప్పటివరకు కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. మచిలీపట్నంలోని డీఈ కార్యాలయం నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. పెడనలో ఆయన్ను కలవాలంటే ఎలాగని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఉన్న కార్యాలయాన్ని మూసేశారని, తాజా పరిస్థితుల నేపథ్యంలో పెడనలో తిరిగి ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రెండు ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి

కానూరు(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే : గ్రామసీమల్లో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం పల్లె పండగకు శ్రీకారం చుట్టిందని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. సోమవారం కానూరు, పెదపట్నం, గోకవరం, సిరివెళ్ళపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి తెదేపా నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం పంచాయతీల నిధులను స్వాహా చేసి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి నిధులు విడుదల చేసిందన్నారు. తెదేపా నేతలు కుంచె నాని, మీనవల్లి నాగేశ్వరరావు, లంకె శేషగిరి, సత్యనారాయణ, గోపు నరేష్, పీత రాము, దివి మహేష్, గోపు వెంకటరమణ, ఈవన సత్యనారాయణ తదితరులున్నారు.



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సత్యనారాయణ



పూజలు అందుకున్న అమ్మవారు



ఆకట్టుకున్న నారసాల ప్రదర్శన

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

రాయవరం(గూడూరు), న్యూస్‌టుడే: దసరా నవరాత్రులు ముగిసిన సందర్భంగా గ్రామంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఊరేగింపునకు స్వాగతం పలికి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఊరేగింపులో భక్తులు నారసాల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

కనకదుర్గమ్మ గ్రామోత్సవం



బంటుమిల్లి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని బంటుమిల్లిలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానం వద్ద అమ్మవారిని సోమవారం ఊరేగించారు. డప్పులు, డీజే సౌండ్‌లతో యువత కేరింతల నడుమ ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు గరికపాటి కూనరావు పాల్గొన్నారు.

కార్యాలయంలో అరకొర సదుపాయాలు

ఛాంబర్లు లేక అధికారులకు ఇబ్బందులు

పెడన, న్యూస్‌టుడే: పెడన మున్సిపల్ కార్యాలయంలో వివిధ సెక్షన్ల అధిపతులకు సరైన సదుపాయాలు లేక పాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పురపాలికలో ప్రధానమైన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, సర్వే, మెప్మా తదితర సెక్షన్లు ఒక హాల్లో నడుస్తున్నాయి. ఈ హాల్లో కనీస సదుపాయాలు లేక అధికారులతో పాటు సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. సందర్శకులు తమ సమస్యలు చెప్పుకునేందుకు సరైన సౌకర్యాలు కూడా ఇక్కడ కనిపించడంలేదు. ఒక సెక్షన్ పక్కగా మరోటి ఉండటంతో కూర్చొని తమ సమస్యను చెప్పే పరిస్థితి లేదు. ప్రజలు తమ ఇబ్బందులు బహిరంగంగా తెలియజేయాల్సిన వస్తోండడంతో అసౌకర్యానికి గురవుతున్నారు.



మున్సిపల్ కార్యాలయ హాల్లో వివిధ సెక్షన్ల అధికారులు

సమస్యలు ఇవీ.. : ❖ ఇక్కడ పని చేస్తోన్న కొంతమంది ఒప్పంద సిబ్బంది కూడా సందర్శకుల ఫిర్యాదులను రాజకీయ నాయకులకు చేరవేస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి.

❖ ప్రధానంగా రెవెన్యూ సెక్షన్‌లో పని చేస్తోన్న ఒప్పంద కార్మికులు సమాచారాన్ని బయటకు చేరవేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి.

❖ కుర్చీలు కూడా లేకపోవడంతో నిల్చొని అధికారులకు వివరించాల్సిన పరిస్థితి నెలకొంది.

❖ మెప్మా సెక్షన్‌లో తరుచూ రిసోర్స్‌పర్సన్లతో సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఈ సమావేశాలకు పట్టణంలోని 28 మంది ఆర్పీలు హాజరు కావడంతో ఈ హాల్లోకి ఇతరులు వెళ్లే పరిస్థితి లేదు.

❖ ప్రధానమైన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సర్వే సెక్షన్ల అధిపతులకు విడివిడిగా ఛాంబర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

❖ దీనిపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి స్పందిస్తూ.. అధికారులకు ఛాంబర్లు ఏర్పాటు అవసరాన్ని తాము గుర్తించామని, త్వరలో ఆ దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పెడన గ్రామీణం: కమలాపురం వద్ద బీటలు వారిన ఆర్‌అండ్‌బీ రహదారి

ప్రమాదకరంగా రహదారి

పెడనగ్రామీణం, న్యూస్‌టుడే: వడ్లమన్నాడు-చెన్నూరు ఆర్‌అండ్‌బీ రహదారి కమలాపురం వద్ద ప్రమాదకరంగా మారింది. రహదారి బీటలు వారి నెల రోజులు గడుస్తున్నా తాత్కాలిక మరమ్మతులకు సైతం అధికారులు ఉపక్రమించలేదు. రెండు వైపులా సైడ్ బెర్మ్‌లు లేకుండా నిర్మించడంతో బీటలు వారింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.10 లక్షల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేసినప్పటికీ అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. బీటల వారిన చోట ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో కొత్త వారు అటువైపుగా ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరిగేందుకు అవకాశముంది. ఈ మార్గంలో ముదినేపల్లి, భీమవరం వరకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైతులు పంట పొలాలకు నిత్యం వెళ్తుంటారు. తక్షణమే రహదారికి మరమ్మతులు చేయించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పురపాలికలో ఓటర్లుగా చేర్పునకు వినతి

పెడన, న్యూస్‌టుడే: 216 జాతీయ రహదారిపై బల్లిపర్రు పంచాయతీ పరిధిలోని రెండు కాలనీల వాసుల్ని పురపాలిక ఓటర్ల జాబితాలో కొనసాగించాలని పలువురు మున్సిపల్ కమిషనర్ గోపాలరావుకు విజ్ఞప్తి చేశారు. పెడనలోని వివిధ ప్రాంతాలకు చెందిన తమకు 2009లో బల్లిపర్రు పంచాయతీ పరిధిలో స్థలాలిచ్చి ఇళ్లను నిర్మించారని, గత పదిహేనేళ్లుగా అక్కడ మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నామన్నారు. బల్లిపర్రు, శింగరాయపాలెం కాలనీల్లో నివాసముంటోన్న తాము పురపాలిక పరిధిలోని వివిధ వార్డుల్లో ఓటర్లుగా ఉన్నామన్నారు. ఆధార్ కార్డులు, పింఛన్లు తదితర సౌకర్యాలు పట్టణం నుంచే తీసుకుంటున్నామని, తాజాగా జరుగుతోన్న మార్పు, చేర్పులతో బల్లిపర్రు పంచాయతీలో చేర్చుతారన్న సమాచారం అందిందన్నారు. తమను పురపాలిక ఓటర్ల జాబితాలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో దాదాపు 50 మంది కాలనీ వాసులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.



అర్జీలపై అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

ప్రమాదంలో తండ్రీకుమార్తెలకు గాయాలు

పెడన, న్యూస్‌టుడే: 216 జాతీయ రహదారిపై మండలంలోని మడక వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో తండ్రీకుమార్తెలకు గాయాలయ్యాయి. మచిలీపట్నం బలరామునిపేటకు చెందిన మోటుపల్లి పేతురు.. తన కుమార్తె విమలతో కలిసి సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం నుంచి బంటుమిల్లి మండలం జయపురం వెళ్తున్నారు. మడక కోఆపరేటివ్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా బైక్ అదుపు తప్పడంతో తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కుమార్తెకు స్వల్ప గాయాలు కాగా.. ఇద్దర్నీ మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన్ను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మడక పెట్రోల్ బంక్ వద్ద గతంలోనూ పలు ప్రమాదాలు జరిగాయి.



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

సూర్యఘర్ యోజన వినియోగించుకోవాలి

గూడూరు, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లి మండలం నాగేశ్వరరావుపేటలో ఎమ్మెల్యే ఇంటికి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా 5 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తును విద్యుత్తు శాఖ అధికారులకు సోమవారం అందజేశారు. ఈ పథక ప్రయోజనాలను విద్యుత్తు శాఖ నోడల్ అధికారి మన్నెం భాస్కరరావు వివరించారు. ఎమ్మెల్యే ఇంటికి సూర్యఘర్ పథకంలో భాగంగా మీటరు కూడా అమర్చామని తెలిపారు. పలువురు విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అధికారులకు దరఖాస్తు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

వైభవంగా ధ్వజదండ, ఉత్సవ విగ్రహ సంప్రోక్షణ

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక సిద్ధేశ్వరాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహ సంప్రోక్షణ, ధ్వజస్తంభ దండ శిఖర పునఃప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. దాతల వితరణతో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో భాగంగా హోమాలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణాల్లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

గుడివాడ గ్రామీణం: స్థానిక పుల్లలపాడు వంతెన వద్ద 9వ వార్డులోని విజయ దుర్గమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన గ్రామోత్సవంలో గుడివాడ మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కేవీకే ప్రధాన శాస్త్రవేత్తగా సుధారాణి

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డి.సుధారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ సుధారాణి ఉయ్యూరు చెరకు పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఘంటసాలకు వచ్చారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.మంజువాణి, బి.నవీన్, జి.కృష్ణవేణి, ఎం.వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డి, సాయి, తదితరులు అభినందించారు.



సుధారాణిని అభినందిస్తున్న శాస్త్రవేత్తలు

అర్జీదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయనతోపాటు కేఆర్‌సీసీ ప్రత్యేక ఉపకలెక్టర్ శ్రీదేవి తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడంతోపాటు వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులతో మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చిన అర్జీలపై విచారణ నివేదికలను కలెక్టరేట్‌లోని ఆర్టీఐ విభాగానికి పంపితే జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తామని కేఆర్‌సీసీ ప్రత్యేక ఉపకలెక్టర్ శ్రీదేవి అన్నారు. వివిధ అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. డీఈవో తాహెరా సుల్తానా, డీఎంహెచ్‌వో గీతాబాయి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి, సీపీవో గణేష్, హౌసింగ్‌పీడీ ఎస్. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో, కేఆర్‌సీసీ ఉపకలెక్టర్ తదితరులు

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం





పవన్ కల్యాణ్ ప్రసంగించే సమయంలో డిజిటల్ తెరపై కాగితం పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు

సభకు తరలి వచ్చిన మహిళలు

పల్లె పండగ పనులు సంక్రాంతిలోగా పూర్తి

కంకిపాడు, కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : వైకాపా, కూటమి పాలనల్లో స్పష్టమైన మార్పును ప్రజలు గుర్తిస్తున్నారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. కంకిపాడులో సోమవారం జరిగిన 'పల్లె పండగ'లో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో గ్రామీణ ఉపాధి హామీ నిధులపై పారదర్శకత, జవాబుదారీతనం లేదని విమర్శించారు. నిధులు ఏమయ్యాయో చెప్పేవారు లేరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో చేపట్టిన పనుల బకాయిలు రూ.23 కోట్లు విడుదలయ్యాయన్నారు. దీనికి కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభల్లో ఆమోదించిన పనులను ఆయా శాఖలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో సంక్రాంతిలోగా పూర్తి చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సభకు కంకిపాడు, పునాదిపాడు సర్పంచులు బాకీ రమణ, ముసిబోయిన విజయకుమారి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు ధూళిపూడి కృష్ణకిషోర్, జనసేన నాయకులు ముప్పా రాజా, పులి కామేశ్వరరావు, పచ్చిపాల శేఖర్, బోయిన నాగరాజు, తెదేపా ప్రతినిధులు దండమూడి చౌదరి, సుదిమళ్ల రవీంద్రప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ, కోయ ఆనంద్, అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ గంగాధరరావు, ఎంపీడీవో అనూష, తహసీల్దార్ భవన్నారాయణ, సీఐ మురళీకృష్ణ పర్యవేక్షించారు. ఎమ్మెల్యేలు వెనిగళ్ల రాము (గుడివాడ), కాగిత కృష్ణప్రసాద్ (పెడన), వర్ల కుమార్‌రాజా (పామర్రు), ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి శశిభూషణ్, కమిషనర్ కృష్ణతేజ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పవన్ పంచ్‌లు.. ఎమ్మెల్యే నవ్వులు

పెనమలూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్.. సోమవారం కంకిపాడు పల్లెపండగలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సమయంలో పవన్ చలోక్తి విసరగా.. బోడే నవ్వులు చిందించారు. - న్యూస్‌టుడే, కంకిపాడు





గృహ నిర్మాణ కార్యాలయం చుట్టూ పొదలు



ఉపాధి హామీ పథకం భవన ప్రాంగణం తీరు



శిథిల భవనాలు తొలగించకపోవడంతో ఇలా..

స్వచ్ఛతే సేవ.. ఎక్కడ?

ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని కార్యాచరణ

న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

స్వచ్ఛతే సేవ.. పరిశుభ్రత, పారిశుద్ధ్య చర్యలకు ప్రాధాన్యతనిస్తూ గత నెల 17 నుంచి ఈ నెల 2 వరకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ 15 రోజులు గ్రామాలు, సామాజిక ప్రదేశాల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేది స్పష్టంగా తెలియపరుస్తూ గోడపత్రికలు, కరపత్రాలు కూడా ముద్రించి పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికార్లు ఆర్భాటంగా ప్రదర్శనలు నిర్వహించారు. కానీ వాస్తవంలో దీని అమలుతీరు అత్యంత దారుణంగా ఉంది. బహిరంగ ప్రదేశాలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముమ్మరంగా శుభ్రత చేపట్టాలని సూచిస్తే, బాపులపాడు మండలంలో ఉన్న ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ నామమాత్రంగా కూడా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు నిత్యం విధులు నిర్వహించే ప్రదేశాల్లోనే ఇంతటి అపరిశుభ్రత నెలకొంటే, సామాన్య జనంలో స్పందన ఎలా ఉంటుందన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. సోమవారం 'న్యూస్‌టుడే' పరిశీలన చేయగా కన్పించిన దృశ్యాలివి.

కంకిపాడు డ్రైనేజీ వ్యవస్థపై చర్చ

కంకిపాడు, కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: కంకిపాడులో ప్రధాన సమస్య మురుగు పరిష్కారంపై సోమవారం జరిగిన 'పల్లె పండగ'లో ఆసక్తికర చర్చ చోటుచేసుకుంది. సుమారు కిలోమీటరున్నర మేర బందరు రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సభా ముఖంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై పవన్ తనదైన శైలిలో సరదా వివరణ ఇచ్చారు. 'నిధులు కేటాయింపునకు హామీ ఇవ్వలేను.. ఎంత మొత్తం అవసరమో అంచనా వేయాలి.. నిధులు అందుబాటులో ఉన్నాయో? లేదో? తెలుసుకోవాలి.. హామీ ఇస్తే పని చేసి తీరాలి. ఒకవేళ చేయలేకపోతే..ఎప్పుడైనా ఇక్కడకు వస్తే సమాధానం చెప్పుకోలేను.' అన్నారు. ఈ దశలో నిధులు కేటాయింపునకు హామీ ఇవ్వాలంటూ పెద్దపెట్టున సభికులు నినదించారు. దీనిపై పవన్ మాట్లాడుతూ 'ఆకలితో ఉన్న కడుపునకు అన్నం పెట్టాలి..ఆ తర్వాత ఇతర వసతులు కల్పించాలి..రహదారులు ఎంతగా పాడయ్యాయో మీకు తెలుసు.. ముందుగా ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇస్తున్నాం..అర్థం చేసుకోండి. అయితే డ్రెయిన్ నిర్మాణానికి నా వంతు కృషి చేస్తానంటూ కలెక్టర్ డీకే బాలాజీకి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి ఎమ్మెల్యే, నాయకులు, సభికులు హర్షధ్వానాలతో స్పందించారు.

ఇద్దరు యువతులకు అస్వస్థత

కంకిపాడు, కంకిపాడు గ్రామీణం: తమ అభిమాన కథానాయకుడు, జనసేనాని పవన్ కల్యాణ్‌ని దగ్గరగా చూడాలనే క్రమంలో సభా వేదిక ముందుకు ఒక్కసారిగా తోసుకువచ్చారు. దీంతో కంకిపాడుకు చెందిన ఇద్దరు యువతులు శ్వాస అందక ఉక్కిరిబిక్కిరయ్యారు. అక్కడే ఉన్న వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేయడంతో ఒకరు సాధారణ స్థితికిరాగా మరొకరిని పక్కనే ఉన్న ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రెండో యువతి కూడా కోలుకున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే బోడే పర్యటన నేడు

పెనమలూరు, న్యూస్‌టుడే: నేడు మండలంలోని పెనమలూరులో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పలుకార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9గంటలకు గ్రామంలోని శ్రీహరి గార్డెన్స్ ఎదురుగా పంచాయతీరాజ్ కాలనీలో సిమెంట్‌రోడ్డు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, అదేవిధంగా మండల పరిషత్తు కార్యాలయంలో ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నున్న (రామవరప్పాడు), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో రూ. 35 లక్షలు, పి.నైనవరం రూ.25 లక్షలు, పాతపాడు రూ.25 లక్షలు, నున్నలో రూ.25 లక్షలు, అలాగే రూ.51.90 లక్షల నున్న పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లేందుకు నిధులు లేకుండా చేశారని విమర్శించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబూరావు, మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల చినరామారావు, సాగునీటి వినియోగదారుల సమాఖ్య సంఘం అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, నాయకులు గండికోట సీతాయ్య, భవాని చిన్నపురెడ్డి, కొండేటి వెంకటరత్నం, నాగేశ్వరరావు, బెజవాడ శ్రీను, ధూళిపాళ్ల దేవేందర్‌రావు, నబి, పండు చిన్నబాబు, శ్రీనివాస్‌రెడ్డి, మాదు శివరాం ప్రసాద్, పోలారెడ్డి సామిరెడ్డి, కోటిరెడ్డి మహేశ్వరరావు, గంపా శ్రీనివాస్ యాదవ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అంబాపురం: శంకుస్థాపన కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, నాయకులు

పురపాలికలో ఎక్కడి చెత్త అక్కడే..

విధులకు హాజరుకాని క్లాప్ వాహనాల డ్రైవర్లు

కానూరు, పోరంకి, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలికలో క్లాప్ వాహనాల డ్రైవర్లు తమకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో సమ్మె బాట పట్టారు. దీంతో వీధుల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైవర్లు 12వ తేదీ నుంచి చెత్త సేకరణ చేయడం లేదు. మొత్తం 45 మంది సమ్మెలో పాల్గొని నిరసన చేపట్టారు. తమ జీతాలు చెల్లించే వరకు విధులకు హాజరయ్యేది లేదని కమిషనర్‌కు తెగేసి చెప్పారు. మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో చెత్త తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించేలా ఎమ్మెల్యే, పురపాలిక అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పోరంకి శ్రీనివాసనగర్‌లో రోడ్లపై చెత్త



జాబిల్లి ఆస్పత్రి మార్గంలో..

తుపాన్ హెచ్చరికలతో రైతులు బెంబేలు

కంకిపాడు, న్యూస్‌టుడే : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, తుపాను హెచ్చరికలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంటలకు భారీ నష్టం జరగడం విదితమే. కోలుకుంటున్న రైతులకు మరో దెబ్బ ఎదురైంది. ప్రధానంగా కూరగాయలు, మెట్ట పైర్లు పాడవుతాయని చెబుతున్నారు. మొక్కజొన్న పంట రహదారులపై ఆరబోశారు. వీటిని రక్షించుకునేందుకు రైతులు పరదాలు కప్పుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పారిశుద్ధ్య సమస్య ఎదురయ్యే పరిస్థితి నెలకొంది.



కొణతనపాడు పరిధిలో సార తోటలో నీరు



ప్రొద్దుటూరు : ఆరబోసిన మొక్కజొన్న పంట

అంబాపురం సర్పంచిపై వీఆర్వో ఫిర్యాదు

చిట్టినగర్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ ప్రాంతంలోని అంబాపురం సర్పంచిపై ఓ మహిళా వీఆర్వో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబాపురం వీఆర్వోగా అరుణాదేవి విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వరద బాధితులకు మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి తన ట్రస్టు ద్వారా ఈ నెల 8న లారీలో బియ్యం పంపగా.. సర్పంచి సీతయ్య జోక్యం చేసుకుని తాను చెప్పిన చోట ఇవ్వాలని ఫోన్‌లో దుర్భాషలాడారని వీఆర్వో ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించి కేసు నమోదు చేయనున్నట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు.

దారి కాచి వ్యక్తిపై దాడి

పెనమలూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెదపులిపాక గ్రామం నుంచి కానూరుకు చినకట్టపై వెళుతున్న వ్యక్తిని దారికాచి దాడి చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కానూరులో నివసించే జి.సిద్ధుకుమార్ ఈనెల 12వ తేదీన ద్విచక్ర వాహనంపై పెదపులిపాకలోని అక్క ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి 11.30 గంటల సమయంలో వస్తుండగా అతని వాహనాన్ని ఆపిన గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. దీంతో భయపడిన బాధితుడు కాలువ కట్ట దిగి దాక్కుని తరువాత తన వాహనంపై అక్క ఇంటికి వెళ్లిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3న ఈత పోటీలు

విజయవాడ క్రీడలు: నగరంలోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో వచ్చే నెల 3వ తేదీన సౌత్ జోన్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఈత పోటీలు నిర్వహిస్తామని ఆయా జిల్లా సంఘాల కార్యదర్శులు ఐ. రమేష్, వి.వినోద్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆసక్తిగల స్విమ్మర్లు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు జాతీయ స్విమ్మింగ్ సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)యూఐడీతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ గుర్తింపు కార్డు లేని పోటీలో పాల్గొనేందుకు అనర్హులన్నారు.



త్రుటిలో తప్పిన ముప్పు

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై గన్నవరం గాంధీబొమ్మ కూడలి సమీపంలో నడిరోడ్డుపై లారీ అర్ధంతరంగా నిలిచింది. విజయవాడ నుంచి ఏలూరు వైపునకు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ డౌన్ అవ్వడంతో అప్రమత్తమైన డ్రైవర్ లారీని హైవేపై నిలుపుదల చేశాడు. డ్రైవర్ అప్రమత్తమతో పెనుప్రమాదం తప్పినప్పటికీ.. లారీని గంటల తరబడి హైవేపైనే నిలుపుదల చేయడంతో తోటి వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు.
– న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

సౌరశక్తి వినియోగంతో ప్రయోజనాలు

ఉయ్యూరు: సౌరశక్తి వినియోగంతో ఎన్నో ఉపయోగాలున్నాయని ఉయ్యూరు సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కృష్ణనాయక్ అన్నారు. స్థానిక శ్రీ రామకృష్ణ రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో సోమవారం ఆ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'పీఎం సూర్య ఘర్ మఫ్త్ బిజిలి యోజన' సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ గృహావసరాలకు సైతం సౌర విద్యుత్తు వినియోగం వల్ల ప్రభుత్వ రాయితీతో పాటు బిల్లుల్ని తగ్గించుకునే అవకాశం ఉందని చెప్పారు. పలువురు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమానికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జి.హేమకుమార్, ఏఈలు, సోలార్ వెండర్స్, బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఈ కృష్ణనాయక్



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కంకిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-20 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక కల్యాణ మందిరంలో ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగింది. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. – కంకిపాడు, న్యూస్‌టుడే

ఘనంగా జపమాల మహోత్సవాలు

కానూరు, న్యూస్‌టుడే : కానూరు కార్మెల్ చర్చిలో సోమవారం జపమాల మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దివ్యపూజాబలి, ప్రత్యే ప్రార్థనలను ఫాదర్లు జయరాజు, సలివేంద్రశౌరిలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.



దివ్య పూజాబలి కార్యక్రమంలో జయరాజు, ఫాదర్ సలివేంద్రశౌరి తదితరులు

మూడు గ్రామాల్లో పల్లె పండగ నేడు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండారుగూడెం, కోడూరుపాడు, వీరవల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జోగేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు బండారుగూడెంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

కాపుల అభ్యున్నతికి కృషి

నున్న(రామవరప్పాడు), న్యూస్‌టుడే: కాపుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన అత్తులూరి జస్వంత్ కుమార్ అన్నారు. సోమవారం విజయవాడ రూరల్ నున్న కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్తగా అత్తులూరి జస్వంత్ కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ప్రకటించారు. అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రకటించాలన్నారు. సంఘం నాయకులు విక్రమ్ మోహన్, తుంపాల వరప్రసాద్, తమ్ముల సాంబశివరావు, పూతి రాజశేఖర్, కొప్పిశెట్టి దుర్గారావు, కోలా రమేష్ పలువురు పాల్గొన్నారు.

భవానీలకు అన్నప్రసాదం పంపిణీ

రామవరప్పాడు, న్యూస్‌టుడే: అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ప్రసాదంపాడు, బెంజ్‌సర్కిల్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో భవానీ మాలధారులకు అన్నప్రసాదం అందజేశారు. భవానీలు పొరుగు జిల్లాల నుంచి కాలినడకన వస్తుంటారని, వారికి తమ వంతు సాయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నపూర్ణ ట్రస్టు నిర్వాహకురాలు జ్యోతి తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా హనుమాన్‌జంక్షన్ వాసవీ మాత గ్రామోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. కోలాటం, నృత్య ప్రదర్శనలతో కోలాహలంగా నాలుగు రోడ్లలో ప్రదర్శన చేశారు. నాసిక్ నుంచి వచ్చిన కళాకారులు అఘోరా వేషధారణలో చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది.

ఉచిత వైద్య శిబిరం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు సోమవారం తెలిపారు. విజయవాడ మాక్స్ విజన్, కృష్ణసాయి దంత వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు వినియోగించుకోవాలని సూచించారు.

సాంకేతికతతోనే వినూత్న ఆలోచనలు

తేలప్రోలు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకొని వినూత్న ఆలోచనల దిశగా యువత అడుగులు వేయాల్సిన అవసరం ఉందని.. తద్వారానే నూతన ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, రక్షణ శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ జి. సతీష్‌రెడ్డి అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలలో 'దేశ విద్యావ్యవస్థ పరివర్తన' అన్న అంశంపై విద్యార్థులకు ఆయన సోమవారం అవగాహన కల్పించారు. అధునాతన క్వాంటం ఫిజిక్స్, సైబర్ భద్రతకు ప్రధాని మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ జి.సతీష్‌రెడ్డిని ఛైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపల్ జీవీకేఎస్‌వీ.ప్రసాద్ ఇతర విభాగాధిపతులు ఘనంగా సత్కరించారు.



డాక్టర్ సతీష్‌రెడ్డిని సత్కరిస్తున్న ఛైర్మన్ సుంకర రాంబ్రహ్మం తదితరులు

భవనానికి రూ. 4 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్‌లోని జేఎంజే కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉపయుక్తంగా ఉండేలా స్రవంతి ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులు సొంత నిధులతో భవన నిర్మాణం చేపట్టారు. దాదాపు రూ.4 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ భవనానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. తమ ట్రస్ట్ తరపున గత కొన్నేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యప్రసాద్ దంపతులు ఆదర్శనీయులని పలువురు కొనియాడారు. ప్రిన్సిపల్ ఆంథోనమ్మ, ఫాదర్ జోసెఫ్ తంబి, నాయకులు వరిగంజి కిషోర్, ముత్యాల సువర్ణ రాజు, దాసరి బెనర్జీ, యార్లగడ్డ సత్యనారాయణ, వడ్లమూడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులు

జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపిక

రామవరప్పాడు, న్యూస్‌టుడే: గత నెలలో జరిగిన ఆటల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు రామవరప్పాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తాయారు తెలిపారు. సోమవారం రామవరప్పాడులోని పాఠశాలలో ఎంపికైన విద్యార్థులు, పీటీలు కె. నిర్మల, ఎన్.జగదీశ్వరీలను సన్మానించి అభినందించారు.



విద్యార్థులతో హెచ్‌ఎం తాయారు, పీటీలు నిర్మల, జగదీశ్వరీలు

ప్రకటన

మా క్లయింట్లు, 1) కృష్ణాజిల్లా, విజయవాడ, గాంధీనగరం, దుర్గాపురం, 4వలైను, డోరు నెం.24-25-1రు వాస్తవ్యులు, శ్రీ దొడ్డపనేని వెంకటేశ్వరరావు గారి కుమారుడు దొడ్డపనేని నవీన్ కుమార్ గారు, మరియు 2) కృష్ణాజిల్లా, విజయవాడ, సత్యనారాయణపురం, లక్ష్మీనగర్, అడవి శేషగిరిరావు వీధి, డోరు నెం.23-25-46రు వాస్తవ్యులు, శ్రీ కోటపాటి గోవిందరెడ్డి గారి కుమారుడు కోటపాటి శ్రీనివాసరెడ్డి గారు, గార్ల సంజాయిషీ పొంది ఇందు మూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి, బొబ్బా మాధవరావు గారి సతీమణి, బొబ్బా సరస్వతమ్మ గారు, వారి భర్త గారి వలన ది.10.05.1950రు న గన్నవరం స.రి.కా వారి కార్యాలయములో 1010/1950రు గా రిజిష్టరు కాబడిన దస్తావేజు ద్వారా స్త్రీ ధనము క్రింద సంక్రమించి దరిమిలా వారు సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో అనుభవిస్తున్నంతలో, సదరు బొబ్బా సరస్వతమ్మ గారు వారి తాలూకు ఆస్తులను గురించి వారి తదనంతరము జరుగవలసిన ఏర్పాట్లను విశదీకరించుచూ ది.05-07-2003వ తేదీన ఒక వీలునామాను వ్రాయించి, సదరు వీలునామాను గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 3వ పుస్తకం, నెం.46/2003 రుగా రిజిష్టరు చేయించి, దరిమిలా సదరు వీలునామాను యెట్టి మార్పులు, చేర్పులు, రద్దు వగైరాలు చేయకుండా, మరి యెట్టి వీలునామా వ్రాయకుండా, అదియే వారి ఆఖరి వీలునామాగా యుంచి, ది.16-06-2005వ తేదీన పరమపదించినారు. వారి మరణానంతరం సదరు వీలునామాలోని అంశముల బట్టి ఎ-షెడ్యూలు 2వ అయిటమ్ ఆస్తిగా దిగువ షెడ్యూలు భూమి, 1) పాటిబండ్ల సురేంద్ర గారికి, 2) పాటిబండ్ల లక్ష్మీ తులశమ్మ గారికి 3) పాటిబండ్ల సాంబశివరావు గారికి మరియు 4) పాటిబండ్ల శ్రీనివాస్ గార్లకు జాయింటుగా సంక్రమించి వారు సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో అనుభవిస్తున్నంతలో; సదరు పాటిబండ్ల లక్ష్మీ తులశమ్మ గారు ది.24-05-2015వ తేదీనయున్నూ, మరియు పాటిబండ్ల సాంబశివరావు గారు ది.22-03-2009వ తేదీనయున్నూ పరమపదించగా, వారల మరణానంతరం 1. పాటిబండ్ల సురేంద్ర గారు, 2. పాటిబండ్ల (లేటు) సాంబశివరావు గారి భార్య పాటిబండ్ల హేమ మంజరి గారు, వీరి కుమారులు 3. పాటిబండ్ల మణికంఠ గారు, 4. పాటిబండ్ల ఆనంద రత్న కృష్ణ గారు, మరియు 5. పాటిబండ్ల శ్రీనివాస్ గార్లకు ఉమ్మడిగా సంక్రమించినంతలో 1. పాటిబండ్ల సురేంద్ర గారు, 2. పాటిబండ్ల (లేటు) సాంబశివరావు గారి భార్య పాటిబండ్ల హేమ మంజరి గారు, వీరి కుమారులు 3. పాటిబండ్ల మణికంఠ గారు, 4. పాటిబండ్ల ఆనంద రత్న కృష్ణ గారు, మరియు 5. పాటిబండ్ల శ్రీనివాస్ గార్లకు ఉమ్మడిగా సంక్రమించినంతలో 1. పాటిబండ్ల సురేంద్ర గారు, 2. పాటిబండ్ల (లేటు) సాంబశివరావు గారి భార్య పాటిబండ్ల హేమ మంజరి గారు, వీరి కుమారులు 3. పాటిబండ్ల మణికంఠ గారు, 4. పాటిబండ్ల ఆనంద రత్నకృష్ణ గారలు, పాటిబండ్ల శ్రీనివాస్ గారి పేరున ది.19.01.2022రు న శ్రీ గన్నవరం స.రి.కా వారి కార్యాలయములో 553/2022రు గా రిజిష్టరు కాబడిన హక్కు విడుదల దస్తావేజు రీత్యా వారలకు గల హక్కులను ఒదులుకొని, పాటిబండ్ల శ్రీనివాస్ గారికి ఆతదాది నుండి నేటి వరకు మన యొక్క సర్వ సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో అనుభవించు చున్నంతలో సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిపై వారికి సరైన ఆయివేజు రాని కారణము చేత అమ్మజూపగా, వారి వద్దనుండి మా క్లయింట్లు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి కొనుగోలు చేయుటకు సిద్ధపడి అందుకు నిదర్శనముగా ది.07.03.2022 న ఒక విక్రయ ఖరారు యెగ్రిమెంటు వ్రాయించుకొని కొంత బయానా యిచ్చి ప్రస్తుతం విక్రయ దస్తావేజు రిజిష్టరు చేసుకొంటాకు సిద్ధపడియున్నారు.

కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై జరుపబోవు నా క్లయింట్లు జరుపబోవు క్రయ విక్రయాదులపై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములుకాని ఆక్షేపణలుగాని తనఖాలు గాని మరి ఏ విధమైన కోర్టు జప్తులు గాని వున్న ఎడల ఈ దిగువ చిరునామాకు 15 దినములలోగ రిజిస్టారు పోస్టు విత్ అక్నాలెడ్జిమెంటు ద్వారా తగిన లిఖితపూర్వక ఆధారములతో తెలియపరచగలరు. లేనియెడల సదరు స్థిరాస్తిని మా క్లయింట్లు నిష్పేచి స్థిరాస్తిగా పరిగణించి మా క్లయింట్లు క్రయముపొందెదరు. మరియు గడువు తదనంతరము వచ్చు అభ్యంతరములు, క్లయిములు పరిగణనలోనికి తీసుకొనబడవనియు మరియు నా క్లయింట్లను బైండు చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు స్థిరాస్తి : కృష్ణాజిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గన్నవరం మండలం, వెదురుపావులూరు గ్రామ శివారు ముస్తాబాద్ గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన, వెదురుపావులూరు గ్రామ ఆర్.యస్.నెం.214/7రు దాఖలా 0.275ట్లు శేరీ మెరక భూమికి హద్దులు: తూర్పు: వాగు, దక్షిణము: కొరివి వెంకట్రామయ్య గారి భూమి, పడమర: మల్లంపల్లి ఘటోత్కచుడు గారి భూమి, ఉత్తరము: తోట రోశయ్య వగైరాల భూమి.
యీ నాలుగు హద్దుల మధ్య యు 275 ట్లు లేక హె.1.11ర్ల స్థిరాస్తి శేరీ మెరక భూమిను, మరియు దానికి గల యావత్తు ఈజ్మెంటు హక్కులతో సహా మొత్తముగా.

ఇట్లు: శ్రీధర్, వలివేటి, MA, LLB, PGDIRPM,
బబిత, R.p., MBA, LLB, న్యాయవాదులు, # 23-15-80,
జి.ఎస్. రాజు వీధి, సత్యనారాయణపురం, విజయవాడ -520011.
సెల్: 9866235888, 9441194808, 2538090

విజయవాడ
10.10.2024



? కోటిరెడ్డి పేటలో చిమటా సూర్యనారాయణ ఇంటివైపు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. - కె రమేష్, కోటిరెడ్డి పేట

✔ పంచాయతీ నిధుల లభ్యతను బట్టి రహదారి నిర్మిస్తాం.
- సలీమ్, పంచాయతీ కార్యదర్శి

? స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - ఎస్.రామారావు, కోటిరెడ్డిపేట

✔ పారిశుద్ధ్య సిబ్బందితో సమస్య పరిష్కరిస్తాం.
- కె సుధాకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టరు

? గుడివాడ బైపాస్‌రోడ్డు నుంచి పుల్లపాడు వైపు వెళ్లే మార్గంలో దారికి ఇరువైపులా చెత్త, సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు పారబోస్తున్నారు. ఈ రోడ్డులో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. - ఏఎస్‌వీ.ప్రసాద్, గుడివాడ

✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- పి.శ్రీనివాస్, సహాయ కమిషనర్, గుడివాడ పురపాలక సంఘం

? శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ముఖ మండపం పైన ఏర్పాటుచేసిన ఫోకస్‌లైట్లు కొన్ని రోజులుగా వెలగడం లేదు. ఆలయ బోర్డు కానరావడం లేదు.
- మల్లి, కోటయ్య, శశిభూషన్, వరదరాజులు తదితర భక్తులు

✔ మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం.
- బొప్పన సత్యనారాయణ, ఆలయ పర్యవేక్షకుడు, మోపిదేవి దేవస్థానం

- న్యూస్‌టుడే, పామర్రు, గుడివాడ పట్టణం, మోపిదేవి

మద్యం దుకాణాల లాటరీ పూర్తి

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: పామర్రు మండలంలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల ప్రక్రియ సోమవారం పూర్తయింది. నాలుగు మద్యం దుకాణాలుండగా ఆశావాహుల నుంచి 47 దరఖాస్తులు వచ్చాయి. మచిలీపట్నంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ నేతృత్వంలో లాటరీ తీసి నిర్వాహకుల్ని ఎంపిక చేశారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 దుకాణాలకు 274 దరఖాస్తులు రాగా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఆధ్వర్యంలో 11 మందిని లాటరీ పద్ధతిన ఎంపిక చేశామని మొవ్వ ఎక్సైజ్ సీఐ బి.వరాలరాజు చెప్పారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 11 మద్యం దుకాణాలకు సోమవారం కలెక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ లాటరీ తీసి దుకాణాల నిర్వాహకులను ఎంపిక చేశారు. గతంలో లేని విధంగా 11 దుకాణాలకు 360 మంది తిరిగిరాని డిపాజిట్లు చెల్లించి (రూ.2 లక్షలు చొప్పున) వేలంలో పాల్గొన్నారు. సోమవారం లాటరీ ద్వారా నిర్వాహకుల్ని ఎంపిక చేశారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

కేవీకే ప్రధాన శాస్త్రవేత్తగా సుధారాణి బాధ్యతల స్వీకరణ

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డి.సుధారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ సుధారాణి ఉయ్యూరు చెరకు పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఘంటసాలకు వచ్చారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.మంజువాణి, బి.నవీన్, జి.కృష్ణవేణి, ఎం.వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డి, సాయి, తదితరులు అభినందించారు.



సుధారాణిని అభినందిస్తున్న శాస్త్రవేత్తల బృందం

జూద శిబిరంపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : దేవరపల్లి గ్రామ పరిధిలో జూద శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి ఆరుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4720 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై అర్జునరాజు తెలిపారు.

పల్లె పండగ.. అభివృద్ధి నిండుగా

రహదారుల నిర్మాణాలకు వాడవాడలా భూమిపూజ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెలు ప్రగతికి పట్టుగొమ్మలని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో అభివృద్ధి చేసి పల్లెల్లో పండగ వాతావరణం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. వలివర్తిపాడు, మోటూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమాల్లో ఆయన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం పంచాయతీలకు పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని దోచుకుందని.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. గుంటాకోడూరులో రూ.10 లక్షలతో, మోటూరులో రూ.40 లక్షలతో, వలివర్తిపాడులో రూ.29.75 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, భాజపా బాధ్యుడు దావులూరి సురేంద్ర, తెదేపా మండల అధ్యక్షుడు వాసే మురళీ, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, ఎంపీపీ గద్దె పుష్పరాణి, ఎంపీడీవో బీవై.విష్ణు ప్రసాద్, సర్పంచి అంగడాల భారతి తదితరులు పాల్గొన్నారు

43 గ్రామాలకు స్వచ్ఛమైన తాగు నీరు

గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 43 గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు కంకిపాడులో జరిగిన పల్లెపండగ సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు.

నందివాడలో..

నందివాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తొలిగా నందివాడలో ఏర్పాటు చేసిన భూమిపూజ, శంకుస్థాపనలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రూ.30.25 లక్షలతో నందివాడలో, రూ.40 లక్షలతో తుమ్మలపల్లిలో, రూ. 45.01 లక్షలతో లక్ష్మీనరసింహాపురంలో, రూ.25 లక్షలతో కుదరవల్లిలో ఉపాధి నిధులతో నిర్మించనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ఆయన పూజ నిర్వహించారు. తెదేపా నాయకుడు వెనిగండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వలివర్తిపాడులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి తదితరులు

రూ.24 కోట్లతో 416 పనులకు శ్రీకారం

కాజ(కూచిపూడి), న్యూస్‌టుడే: పామర్రు నియోజకవర్గంలో 416 అభివృద్ధి పనులను రూ.24 కోట్లతో నిర్వహిస్తున్నామని శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా అన్నారు. మొవ్వ మండలం కాజలో ఏడు రహదారులను రూ.35 లక్షలతో అభివృద్ధికి సోమవారం సాయంత్రం భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. తెదేపా మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, సర్పంచి కొడాలి భవాని, క్లస్టర్ ఇన్‌ఛార్జి యార్లగడ్డ శ్రీనివాసరావు, పీఆర్ డీఈ సురేష్, ఎంపీడీవో విమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కాజలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, నాయకులు

రొయ్యూరు- కంకిపాడు రోడ్డు మంజూరుపై హర్షం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: తోట్లవల్లూరు మండలం రొయ్యూరు నుంచి కంకిపాడు ప్రధాన రోడ్డుని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంపై ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హర్షం వ్యక్తంచేశారు. సోమవారం కంకిపాడులో నిర్వహించిన పల్లె పండగలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అధికారులతో చర్చించి కంకిపాడు రోడ్డు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం పలు మండలాల ప్రజలకు సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే వర్ల తెలిపారు.

మేడూరు, హనుమంతపురంలో నేడు

మేడూరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: పల్లెపండగ కార్యక్రమం సందర్భంగా మంగళవారం ఉదయం 8 గంటలకు మేడూరు, 8.30కి హనుమంతపురంలో శాసనసభ్యుడు వర్ల కుమారరాజా వరుసగా రూ.46 లక్షలు, రూ.19 లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తారని అధికారులు తెలిపారు.

పంచాయతీల సమగ్రాభివృద్ధే ధ్యేయం : బుద్ధప్రసాద్

అశ్వరావుపాలెం(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: మహాత్ముని ఆశయాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సీమల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గ్రామాల్లో అన్ని మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అశ్వరావుపాలెంలో 3 అంతర్గత రహదారులను 395 మీటర్ల పొడవునా రూ.23.60 లక్షలతో సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసే పనులకు ఎమ్మెల్యే సోమవారం భూమి పూజ చేశారు. సర్పంచి పంద్రాజు లంకమ్మ ప్రసాద్ అధ్యక్షతవహించారు



అశ్వరావుపాలెంలో భూమి పూజలో ఎమ్మెల్యే మండలి , కూటమి నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు పట్టించుకోరేం?

మోపిదేవి, న్యూస్‌టుడే: కె.కొత్తపాలెం, బండికోళ్లలంక గ్రామాల్లో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ఎందుకు పట్టించుకోరని ప్రజాప్రతినిధులు ఐసీడీఎస్ అధికారిని నిలదీశారు. సోమవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం అధ్యక్షురాలు రావి దుర్గావాణి అధ్యక్షతన నిర్వహించారు. కె.కొత్తపాలెం ఎస్‌డబ్ల్యూ ప్రాథమికోన్నత పాఠశాలపై గతంలో వచ్చిన ఫిర్యాదులపై ఎంఈవో దుర్గాసాగర్ వివరణ ఇచ్చారు. రూ.22లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో 10 అభివృద్ధి పనులను ప్రతిపాదించగా ఆమోదించారు. వచ్చే నెల 6 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు గడువు పెంచినట్లు రెవెన్యూశాఖ అధికారులు ప్రకటించారు. 11వ నంబరు కాల్వ ఆయకట్టు శివారున గల అయోధ్య, అడపావారిపాలెం వ్యవసాయ భూములు నీటికొరత ఎదుర్కొంటున్నాయని ఉప ఎంపీపీ కె.సీతారామాంజనేయులు జలవనరుల శాఖ ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు రెవెన్యూ అధికారి పేర్కొన్నారు. మండలానికి 146 మినీ గోకులాలు మంజూరైనట్లు ఆ శాఖ అధికారి తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, ఉప ఎంపీపీ ఎన్.జననీకుమారి, ఎంపీడీవో స్వర్ణభారతి, పర్యవేక్షకులు ఆకుల పాండురంగారావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాఠశాల సమస్యపై చర్చిస్తున్న ఎంఈవో, జడ్పీటీసీ సభ్యుడు

బాధిత కుటుంబానికి సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లికి చెందిన కిడ్నీ బాధితుడు అబ్దుల్ సుభానీ కుటుంబానికి పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్(ఐవీఎం) అండగా నిలిచింది. ఐవీఎం సహకారంతో అబ్దుల్ సుభానీ పిల్లలు నజ్రీన్, సుహాన్ విద్యాభ్యాసానికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్ అందజేశారు. ఐవీఎం ట్రస్ట్ డైరెక్టర్ వి.రోజా, న్యాయవాది టి.ప్రసాద్, మస్తాన్, పి.రాజా పాల్గొన్నారు.

దుకాణ సముదాయం సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మున్సిపల్ దుకాణ సముదాయంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని గుడివాడ మున్సిపల్ దుకాణ సముదాయ సంఘం నాయకులు కమిషనర్ బి.శ్రీనివాస్‌ను కోరారు. సోమవారం వారు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు కొత్త సుబ్బారావు, సయ్యద్ గఫార్ తదితరులు పాల్గొన్నారు. కోరారు.

పాల కేంద్రాల పరిశీలన

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: అంగలూరు, విన్నకోట, శేరిదగ్గుమిల్లి పాల సేకరణ కేంద్రాలను సోమవారం జిల్లా పాల సమితి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, డైరెక్టర్ వల్లభనేని బాబూరావు పరిశీలించారు. పాల సేకరణను తనిఖీ చేసి రైతులకు, పశుపోషకులకు సమితి ద్వారా అందిస్తున్న పలు పథకాలను వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాయన హరిప్రసాద్, పాలపర్తి నరసింహారావు, భూబత్తిన కాశీశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.34,296

కోడూరు (అవనిగడ్డ): లింగారెడ్డిపాలెంలో వేలమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసినప్పటి నుంచి 6 మాసాల్లో భక్తులు కానుకలు సమర్పించారు. సోమవారం హుండీ తెరిచి లెక్కించగా రూ.34,296 ఆదాయం వచ్చినట్లు కమిటీ తెలిపింది.

గుత్తేదారు పాపం.. ప్రయాణికులకు శాపం

రూ.40 లక్షల ప్రజాధనం మట్టిపాలు

మూణ్నాళ్ల ముచ్చటగా వైకాపా హయాంలో చేసిన పనులు

న్యూస్‌టుడే, కూరాడ(గుడ్లవల్లేరు)

అదో రాష్ట్ర రహదారి.. రూ.40 లక్షలతో మరమ్మతులు చేసిన 6 నెలలకే మళ్లీ గుంతలు పడి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. వైకాపా హయాంలో గుత్తేదారుల పాపం వాహనదారులకు శాపంగా మారింది. అదే గుడ్లవల్లేరు - ముదినేపల్లి ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో హడావుడిగా రూ. 40 లక్షలతో మరమ్మతులు చేశారు. అసలే అరకొరగా చేసిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలివ్వడంతో మరమ్మతులు చేసిన 6 నెలలకే రహదారి మళ్లీ యథాస్థితికి చేరింది. చేసిన పనులు వర్షాలకు కరిగిపోయి అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాటిల్లో వాన నీరు నిలిచిపోవడంతో తటాకాలను తలపిస్తూ రహదారి వెతుక్కోవాల్సిన దుస్థితి. ప్రయాణికులు, వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. ఈ రహదారి పరిస్థితి చూసి ఏప్రిల్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ వారాహియాత్ర గుడ్లవల్లేరు రాకుండా వేరే మార్గంలో మళ్లించారు. ప్రజలు తిడుతుండటంతో అప్పటి ఎమ్మెల్యే కొడాలి నాని మార్చి మొదటివారంలో రూ. 40 లక్షలతో మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఏప్రిల్ మొదటి వారంలో పనులు చేపట్టారు. మండల పరిధిలోని విన్నకోట నుంచి కూరాడ వరకూ భారీ గోతులు తవ్వి జీఎస్బీ పోసి అక్కడక్కడ తారువేశారు. 6 నెలలకే మళ్లీ గుంతలు ప్రత్యక్షమయ్యాయి. రూ. 40 లక్షలు ఏమయ్యాయో వైకాపా నాయకులు, గుత్తేదారుడికి, అధికారులకే తెలియాలి. దీనిపై విచారణ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



6 నెలలకే తారు లేచిపోయి ఇలా..



చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరి తటాకాలు తలపిస్తూ..

ఆర్టీసీ బస్సులు లేక పాట్లు

విజయవాడలో ట్రాఫిక్ సమస్యతో రాకపోకలకు ఇబ్బంది

న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

సకాలంలో బస్సులు లేక గుడివాడ ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు సోమవారం అవస్థలు పడ్డారు. దసరా సెలవులు ముగియడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రయాణికులు తరలివచ్చారు. వారి గమ్య స్థానాలకు వెళ్లే బస్సులు సకాలంలో రాకపోవడంతో బస్ స్టాండు ప్రయాణికులతో కిక్కిరిసింది. గంటల తరబడి నిల్చోలేక ఎక్కడ పడితే అక్కడ చతికిల పడ్డారు. టికెట్ల కోసం విజయవాడ నాన్ స్టాప్ కౌంటర్‌లో మూడు వరుసల్లో బారులుతీరారు. చాలా సేపు నిరీక్షించి కొంత మంది తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. విజయవాడ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు గంటకు కూడా రాకపోవడంతో ఒక్కో గంటకు మూడు బస్సుల ప్రయాణికులు క్యూలైన్‌లోనే నిరీక్షించారు. విజయవాడకు 16 నాన్ స్టాప్, 15 పల్లె వెలుగు సర్వీసులు ఉన్నా ఒక్కో బస్సు రావడానికి గంటన్నర నుంచి రెండు గంటలు పట్టిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు.



కిక్కిరిసిన నాన్ స్టాప్ కౌంటర్

భవానీల దీక్షల విరమణ వల్లే..

భవానీ దీక్షాధారులు మాల విరమణ సందర్భంగా విజయవాడలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. విజయవాడ బస్టాండు రోడ్డులో పూర్తిగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి బస్ స్టాండు ప్రాంతంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల రాకపోకలకు గంటల సమయం పడుతూ సమస్య తలెత్తింది.

గంటన్నర క్యూలైన్‌లో నిల్చున్నా ప్రయోజనం లేదు



సుమారు గంటన్నరకుపైగా క్యూలో నిలబడినా బస్సు రాలేదు. వందలాది మంది నిల్చొనే నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నాం. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పుడు మరిన్ని బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు స్పందించలేదు. - సురేష్

ట్రాఫిక్ సమస్య వల్లే

విజయవాడలో సోమవారం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురైంది. బస్సులు బయటకు రవాణానికి రెండు గంటల సమయం పట్టింది. బస్సులు అందుబాటులో ఉన్నా అధిక ట్రాఫిక్ వల్ల సకాలంలో రాలేదు.
- సత్యనారాయణ, ఆర్టీసీ సీఐ



గండి పూడ్చాలని గ్రామస్థుల ఆందోళన

పెదపారుపూడి, న్యూస్‌టుడే: వన్నేరు డ్రెయిన్‌కు పడిన గండ్లు పూడ్చాలంటూ మోపర్రు గ్రామస్థులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలకు వన్నేరు డ్రెయిన్‌కు మూడు చోట్ల గండ్లు పడి వేయి ఎకరాల్లో వరి పొలాలు, ఇళ్లు పూర్తిగా నీట మునిగాయన్నారు. డ్రెయినేజీ అధికారులు ఇప్పటి వరకు వాటిని పూడ్చకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్పపీడనం ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జారిపోతున్న డ్రెయిన్ గట్లు పటిష్ఠపర్చాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వన్నేరు డ్రెయిన్‌కు పడిన గండ్లు పూడ్చాలని రైతులు, గ్రామస్థులు కోరారు.



కోడూరు: ఇంటిపై పడిన తాడిచెట్టు



పామర్రు : చెరువును తలపిస్తున్న బస్టాండు



అవనిగడ్డ గ్రామీణం: అశ్వరావుపాలెంలో రహదారిపై ఇలా..

భారీ వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక బస్ స్టాండు, పామర్రు విజయవాడ రహదారి పక్కన పోలీస్ స్టేషన్ ఎదురుగా నీరు నిలిచి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జనజీవనం అస్తవ్యస్తం

అవనిగడ్డ గ్రామీణం, కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో సోమవారం అవనిగడ్డ పరిసర ప్రాంతాల్లో వాన ముంచెత్తింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. అశ్వరావుపాలెం, వేకనూరు, తుంగలవారిపాలెం, పులిగడ్డ తదితర ప్రాంతాల్లో పల్లపు ప్రాంతాలు వాననీటితో నిండాయి. లంకమ్మమాన్యం, రాజశేఖరపురం, సింహాద్రి కాలనీ, మండలిపురం రహదారులు చిత్తడిగా మారాయి. రహదారులపై నిలిచిన నీటిని బయటకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

☛ ఉల్లిపాలెం గ్రామానికి చెందిన ఒడుగు పున్నారావు నివాస గృహం పక్కన ఉన్న తాడిచెట్టు వానకు ఇంటిపై పడింది. ఆ సమయం ఇంటిలో ఉన్న వారికి ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా ధ్వజదండ, ఉత్సవ విగ్రహ సంప్రోక్షణ

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక సిద్ధేశ్వరాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహ సంప్రోక్షణ, ధ్వజస్తంభ దండ శిఖర పునఃప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. దాతల వితరణతో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో భాగంగా హోమాలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణాల్లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక పుల్లలపాడు వంతెన వద్ద 9వ వార్డులోని విజయ దుర్గమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన గ్రామోత్సవంలో గుడివాడ మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు చల్లపల్లి విద్యార్థిని

చల్లపల్లి, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చల్లపల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని జి.ఏక్తాప్రియ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ డి.సురేష్ సోమవారం తెలిపారు. తిరుపతిలో జరిగిన ఈ పోటీల్లో 6వ తరగతి విద్యార్థిని ఏక్తాప్రియ అండర్-14 విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ సురేష్, సుబ్బు తైక్వాండో వారియర్స్ అకాడమీ కోచ్‌లు కె.సుబ్బు, ఎస్.జాహ్నవి అభినందించారు.



విద్యార్థిని ఏక్తాప్రియను అభినందిస్తున్న ప్రిన్సిపల్, కోచ్‌లు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవం

మోపిదేవి, ఘంటసాల, కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఘంటసాల అంబేద్కర్‌నగర్‌లో అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం సమీపంలోని కృష్ణానదిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. కోడూరులోని అంకాలమ్మ గుడిలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



ఘంటసాలపాలెంలో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు